నెల్లూరు, 05.06.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 01 పేజీలు : 12, వెల : ₹ 5

Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## తగ్గుతున్న బాబు ఇమేజ్...

# నారాయణతో డామేజ్

- సీనియర్ నేతల్లో తీవ్ర అసంతృప్తి
- పచ్చటి పార్టీలో వివాదాల చిచ్చు
- కేడర్‌ను కంపు కొట్టిస్తున్న కార్పొరేట్ మంత్రి



ఓ పాత తెలుగుసినిమాలో చూసుంటాం. హీరో ఇంట్లోకి చుట్టం చూపుగా ఓ పెద్దావిడ వస్తుంది. పచ్చటి ఆ కుటుంబంపై ఆమె కళ్లు పడతాయి. ఒకరి మీద ఒకరికి చాడీలు చెబుతుంది. ఒకరిపై ఒకరికి అనుమానాలు పెంచుతుంది. ఒకరినొకర్ని దూరం చేస్తుంది. పచ్చటి కాపురంలో చిచ్చు పెడుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని పసుపు పచ్చ పార్టీలో మంత్రి నారాయణది ఇదే పాత్ర.

(మిగతా 12వ పేజీలో)



# డబ్బుతో గబ్బు

- అవినీతి గురించి మాట్లాడే అర్హత ఉందా?

చంద్రబాబు ఈమధ్య నీతి, విలువల గురించి బాగా మాట్లాడుతున్నారు. గత పాలకులు అవినీతిపరులంటూ పాడిందేపాటగా విమర్శలు చేస్తున్నారు. అవినీతిపై పోరాటంలో ఆంధ్రా హజారేనంటూ తనకు తాను ట్యాగులు తగిలించుకున్నాడు కూడా! అయితే ఇప్పుడు... అవినీతి గురించి మాట్లాడే అవకాశమే లేకుండా చంద్రబాబు నోటికి తాళం పడింది. రేవంత్‌రెడ్డి వ్యవహారంతో చంద్రబాబు పరువు, ప్రతిష్ట నడిబజారులో పోయింది.

(మిగతా 2వ పేజీలో)



## వ్యక్తి కాదు...
# దేశానికి శక్తి

రక్షణ శాఖ మంత్రి సాంకేతిక సలహాదారుగా సతీష్‌రెడ్డి 11లో

రేపటి నుండి...

ది బిగ్గెస్ట్ ఆషాఢం సేల్

FLAT 50% OFF | FLAT 25% OFF

కంచి పట్టు చీరలు, డిజైనర్ శారీస్, సల్వార్స్, డ్రస్ మెటీరియల్స్, వెస్ట్రన్ వేర్, కిడ్స్‌వేర్ పై




*Conditions apply.

K.V.R పెట్రోల్ బంక్ ఎదురుగా, దర్గమిట్ట,
G.N.T రోడ్, నెల్లూరు, ఫోన్: 2316667.

## అక్షరాలు మావి ఆశీస్సులు మీవి

### ఈ అనుబంధానికి 34ఏళ్ళు

ఒక చారిత్రాత్మక సంస్థని సంస్థ ఆస్తులని అన్యాక్రాంతం కాకుండా కాపాడడానికి నెల్లూరుజిల్లా స్థానిక పత్రికా ప్రపంచంలో పురుడుపోసుకున్న నెల్లూరీయుల మానస వార్తా పుత్రిక 'లాయర్'వారపత్రిక. 1981 జూన్ 5వ తేదీ నుండి ఈరోజు వరకు నిరంతరం ప్రజల పక్షాన పోరాడే కరదీపికగా న్యాయం కోసం పరితపించే ధర్మవీచికగా ప్రజల అవసరాలను ప్రభుత్వానికి రాజకీయ పెద్దలకు తెలిపే అక్షర సూచికగా మా(మీ) 'లాయర్' పాఠకుల హృదయాలలో చెరగని ముద్ర వేసుకుంది.

మంచిని చప్పట్లతో, చెడుని చీవాట్లతో తనదైన తరహాలో సత్కరిస్తూ, వారం వారం వెన్నుచూపని వార్తా బాణాలను సంధిస్తూ ప్రపంచవ్యాప్తంగా వున్న లక్షలాది మంది నెల్లూరీయులను అలరిస్తోంది మా(మీ) 'లాయర్'.

సమున్నత ఆశయాలే లక్ష్యంగా, సమాజ శ్రేయస్సును కాంక్షించే సంస్కరణలే ధ్యేయంగా కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు ప్రారంభించిన అక్షర సమరానికి నేటితో 34 సంవత్సరాలు నిండాయి. ఆయన చూపించిన బాటలో, ఆయన అందించిన సమరస్ఫూర్తితో నిరంతర వార్తా ప్రస్థానంతో నిర్విరామ అక్షర సంచలనాలతో ముందుకు పయనిస్తోంది మా(మీ) 'లాయర్'.

పాతికేళ్ళు మైలురాయిగా 2006 జూన్ 3న సాక్షాత్తూ ఆనాటి ముఖ్యమంత్రి డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి గారి సువర్ణహస్తాలతో నెల్లూరులో స్వంతగూటిని ప్రారంభించుకున్నా... గ్రామీణ ప్రాంత వార్తలకు ప్రాధాన్యత కల్పించాలనే సంకల్పంతో 2010లో గూడూరు శాఖను ఏర్పాటు చేసుకున్నా, మెట్ట ప్రాంతవాసుల వాణిని 'లాయర్' పదునైన బాణి ద్వారా వినిపించాలనే ధ్యేయంతో 2015లో కావలి కార్యాలయాన్ని నెలకొల్పినా ఇవన్నీ 'లాయర్'అభిమానుల అండతోనే.

ప్రకటనలు కరువైనా, న్యూస్ ప్రింట్ ధరలు బరువైనా పెరుగుతున్న అరువు భారమైనా ఎవరికీ దరువెయ్యకుండా పరువుతో పరుగులు తీస్తూ ఎందరో ఆత్మీయులు, ఆప్తులు, శ్రేయోభిలాషులు సేవాభిలాషుల అమూల్య ఆశీస్సులతో 35వ పడిలో అడుగిడి నేడు తన సుదీర్ఘ వార్తా ప్రయాణంలో మరో మెట్టు ఎక్కిన ఆనంద సమయంలో ఆదరిస్తున్న వారికి, ఆశీస్సులందిస్తున్న వారికి... ఆదరాభిమానాలను చూపిస్తున్న వారికి, పాఠకులకి, ప్రకటనకర్తలకి, అందరికీ పేరుపేరునా అక్షర నీరాజనాలు అర్పిస్తోంది మా(మీ) 'లాయర్'.

తుంగా శివప్రభాత్‌రెడ్డి
సం/-

## అభివృద్ధే 'బాస'గా...
# నెల్లూరు నెక్ట్స్




నెల్లూరు అభివృద్ధే కర్తవ్యంగా, "స్వర్ణభారత్ ట్రస్ట్" మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ ప్రోద్భలంతో "నెల్లూరు నెక్ట్స్" అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి వివిధ ప్రాంతాల్లో వున్న నెల్లూరీయులందరినీ ఓ చోటకు చేర్చి నెల్లూరు అభివృద్ధి కోసం మీ సలహాలూ సూచనలూ ఇవ్వండి అంటూ కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు చేస్తున్న ప్రయత్నం ఆశాజనకంగా కనిపిస్తోంది.

ఏప్రియల్ 25వ తేదీన నెల్లూరు విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో తొలి విడత సమావేశంలో పెద్దస్థాయిలో నెల్లూరీయులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి ఓ దిశానిర్దేశం జరగలేదు. అయితే నెల్లూరోళ్ళంతా ఓ చోట చేరితే అద్భుతాలు సాధిస్తారనే దృఢమైన నమ్మకం అందుకు అవసరమైన స్ఫూర్తి ఈ సమావేశంలో లభించింది.

అదే స్ఫూర్తితో మే 31వ తేదీ ఆదివారం నెల్లూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో "నెల్లూరు నెక్ట్స్" రెండవ సమావేశం జరిగింది. (మిగతా 11వ పేజీలో)

## విశ్వసాయి విద్యార్థినికి బాలభవన్ జాతీయ అవార్డు



విశ్వసాయి జూనియర్ కాలేజీలో ఎంపిసి చదువుతున్న యం.అశ్రిత జాతీయ స్థాయిలో బాలభవన్‌లో పాల్గొన్నందుకు అవార్డ్ పొందింది. ఈ సందర్భంగా విశ్వసాయి డైరెక్టర్లు డా॥ యన్.సత్యనారాయణ, కృష్ణమోహన్‌లు అశ్రితకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ... కేవలం చదువులోనే కాక వివిధ రంగాల్లో తమ విద్యార్థులు రాణించడం గర్వకారణంగా వుందన్నారు. అశ్రిత 10వ తరగతిలో 9.8జిపిఏ సాధించింది. ప్రస్తుతం విశ్వసాయి జూనియర్ కాలేజీలో ఎంపిసి ద్వితీయ సంవత్సరంలోకి ప్రవేశించింది. జూనియర్ ఇంటర్‌లో 470మార్కులకు 458మార్కులు సాధించి అకడమిక్స్‌లో కూడా ప్రతిభ చూపుతుందని తెలిపారు. అశ్రిత మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నుండి విశ్వసాయిలో తర్ఫీదు ఇస్తున్నారని, దీనికి అనుగుణంగా షెడ్యూల్ విధానం, బోధనా పద్ధతులు ఉంటాయని, కాలేజీ అనుసరించే 5స్టెప్ ప్రోగ్రామ్, స్ట్రెస్-ఫ్రీ ఎడ్యుకేషన్ వల్లనే తాను ఈ అవార్డు పొందానని తెలిపారు.

## చెంగాళమ్మకి ముత్యాలహారం

నెల్లూరుజిల్లా సూళ్లూరుపేటలో కొలువైవున్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి నెల్లూరుకు చెందిన పల్లంరెడ్డి శ్రీనివాసులురెడ్డి 26గ్రాముల బంగారు డాలర్‌తో కూడిన ముత్యాలహారాన్ని ఆదివారం పాలకమండలి ఛైర్మెన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులురెడ్డికి అందజేశారు. ఇదిలా వుండగా, చెన్నైకి చెందిన కె.కిరణ్‌కుమార్ కుటుంబసభ్యులు అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి రూ.25వేలు అందజేశారు. ఈ సందర్భంగా పాలకమండలి ఛైర్మెన్ ఇసనాక మాట్లాడుతూ దాతలు స్పందించి కానుకలు సమర్పించడంతో అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రతిభకు మెరుగులు దిద్దే 'బ్రహ్మయ్య కాలేజీ'



విద్యార్థుల ప్రతిభకు మెరుగులు దిద్దుతూ, మట్టిలో మాణిక్యాలుగా వున్న ఎందరో పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తెచ్చి, విద్యార్థులెందరికో మంచి భవితవ్యం చూపుతోన్న బ్రహ్మయ్య ఇంజనీరింగ్ కాలేజీ, ఈసారి ఎంసెట్‌లో ర్యాంకులు సాధించి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరనున్న విద్యార్థులకు పలు రాయితీలను ప్రకటించింది. ఎంసెట్‌లో ర్యాంకులు వచ్చిన విద్యార్థులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హత వున్న విద్యార్థులు ఎలాంటి ఫీజులు చెల్లించనవసరం లేదని, వారు నేరుగా తమ కళాశాలకు వచ్చి, వారికి నచ్చిన కోర్సుల్లో చేరవచ్చని ఆ కాలేజీ నిర్వాహకులు జి. బ్రహ్మయ్య తెలిపారు. అంతేకాదు, ఇంటర్‌లో 900 పైన మార్కులు వచ్చిన విద్యార్థులకు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కలిగిన విద్యార్థులకు తమ కళాశాల హాస్టల్‌లో నాలుగేళ్లపాటు ఉచిత భోజన సదుపాయం కూడా కల్పిస్తామన్నారు. డే స్కాలర్ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

మొదటి సంవత్సరం చదివే విద్యార్థులకు, దూరంతో నిమిత్తం లేకుండా ఏడాదికి కేవలం 6 వేల రూపాయలకే బస్సు సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు, ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా విద్యార్థుల భవితకు బంగారుబాట వేయాలన్నదే తమ జీవిత లక్ష్యమని ఆయన అన్నారు. తమ కాలేజీలో చేరే విద్యార్థులకు మంచి భవిత వుంటుందనే నమ్మకం వుందని, అదే విశ్వాసంతో ఎందరో విద్యార్థులు తమ కళాశాలలో చేరుతున్నారని ఆయన అంటూ, వారందరి ప్రతిభకు మరింత మెరుగులు దిద్దడం ద్వారా వారి జీవితాలకు వెలుగుబాటలు వేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.


## వింజమూరు గ్రామపంచాయతి కార్యాలయము

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా.

ఆర్.ఓ.సి.నెం.6/2015 తేది.01.06.2015

### టెండరు ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా వింజమూరు మండలం, వింజమూరు గ్రామ పంచాయితీలో కాంట్రాక్టు పద్ధతిపై తే.01.07.2015ది నుండి తే.30.06.2016ది వరకు ఒక(1) సంవత్సరకాలమునకు ఈ క్రింద కనబరచిన ప్రకారము వివిధ రకముల సేవలు అందించుటకు వింజమూరు గ్రామపంచాయితీలో తే.10.06.2015దిన ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు టెండర్లు స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లను అదేరోజు మధ్యాహ్నం 3గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. టెండరు దాఖలు చేయువారు ఆయా వివరములకు ఎదురుగా చూపబడిన ధరావత్తును చెల్లించి టెండర్లు దాఖలు చేయవలయును. ఇతర వివరములు పంచాయితీ కార్యాలయము పనిచేయు వేళలలో అడిగి తెలుసుకొనవచ్చును.

| క్ర.సం. | వివరములు | సిబ్బంది సంఖ్య | ధరావత్తు రూ. |
|---|---|---|---|
| 1. | మురుగు కాలువలు నిర్వహణకు | 3(ముగ్గురు) | రూ.200/-లు విడివిడిగా ఒక్కొక్కరికి |
| 2. | పారిశుద్ధ్య పనుల నిర్వహణకు | 20(ఇరవై) | రూ.200/-లు విడివిడిగా ఒక్కొక్కరికి |
| 3. | మంచినీటి సరఫరా నిర్వహణకు | 4(నలుగురు) | రూ.200/-లు విడివిడిగా ఒక్కొక్కరికి |
| 4. | వీధి విద్యుత్ దీపములు నిర్వహణకు | 2(ఇద్దరు) | రూ.200/-లు విడివిడిగా ఒక్కొక్కరికి |
| 5. | ట్రాక్టరు డ్రైవరు | 1(ఒకరు) | రూ.200/-లు విడివిడిగా ఒక్కొక్కరికి |
| 6. | పంప్ ఆపరేటర్లు | 10(పది) | రూ.50/-లు విడివిడిగా ఒక్కొక్కరికి |

గమనిక: 1) అనివార్యకారణముల వలన ప్రభుత్వము వారు టెండరు నిర్వహించు తేదీని సెలవు దినముగా ప్రకటించిన యెడల మరుసటి కార్యాలయ పనిదినమున టెండర్లు నిర్వహించబడును.
2) టెండర్లు పాక్షికముగా గాని, పూర్తిగా గాని రద్దు పరచుటకు లేదా వాయిదా వేయుటకు లేదా నిలుపుదల చేయుటకు పంచాయితీ కార్యదర్శి వారికి అధికారము కలదు.

సం/- డేవిడ్ రాజు
పంచాయితీ కార్యదర్శి, వింజమూరు గ్రామపంచాయతి.


# బైక్ దొంగలు పట్టుబడ్డారు..

గూడూరు 1వ పట్టణ పోలీస్ వారు వెంకటగిరి క్రాసురోడ్డు వద్ద గుంజి ప్రకాష్, ఏర్నాల సాయి, కుప్పాల మునికుమార్, ముగదోశి శ్రావణ్‌కుమార్ అలియాస్ అబ్బాస్ అనే నలుగురు బైక్ దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 7లక్షల రూపాయలు విలువచేసే 14బైకులను స్వాధీనం చేసుకున్నట్లు గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆయన బుధవారం సాయంత్రం 1వ పట్టణ



మాట్లాడుతున్న గూడూరు డిఎస్పీ బి.శ్రీనివాస్, ప్రక్కన సిఐ సుబ్బారావు, ఎస్సై బాబి

పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ఈ14మోటార్ సైకిళ్లను దొంగతాళాలతో దొంగిలించి సదరు మోటారుసైకిళ్లను నాల్గవ ముద్దాయి గూడూరుకు చెందిన శ్రావణ్‌కుమార్ అలియాస్ అబ్బాస్ ఇంటిలో ఎవరికి తెలియకుండా దాచాదని, అన్నింటిని ఒకేసారి తిరుపతికి గాని, చెన్నైకి గాని తీసుకొనిపోయి అమ్ముకొనేందుకు ప్రయత్నం చేస్తుండగా అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. గూడూరు పట్టణ సిఐ టి.వి. సుబ్బారావు పర్యవేక్షణలో 1వ పట్టణ ఎస్సై బాబి తన సిబ్బంది సహాయంతో పట్టుకొన్నట్లు తెలిపారు. ఎస్ఐ బాబికి, ఏఎస్ఐ తిరుపతయ్య, పిసి పి.మాధవరావు, ప్రభాకరరావు, శ్రీనివాసులు, బి.రమేష్, కె.కిషోర్‌బాబులకు గూడూరు డిఎస్పీ నగదు రివార్డు అందజేశారు.

## బి.వి కి జివిఆర్ పురస్కారం



హైదరాబాద్ చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలో ఈ నెల 5వతేదీ శుక్రవారం జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ పదమూడవ వార్షికోత్సవ వేడుకలు ముగింపు ఉత్సవం సందర్భంగా తొమ్మిది మంది రంగస్థల వ్యాఖ్యాతలను సత్కరిస్తున్నారు. వీరిలో నెల్లూరీయుడు ద్విసహస్ర సభాసింహం బి.వి.నరసింహం ముఖ్యఅతిథుల చేతులమీదుగా పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ సందర్భంగా నెల్లూరీయులు బి.వి.నరసింహంకు శుభాభినందనలు తెలియజేసారు.

### డాక్టర్ విజయకుమార్ హత్యపై న్యాయపోరాట కమిటీ

జనవిజ్ఞానవేదిక నాయకుడు, నెల్లూరు ఆసుపత్రి అధినేత డాక్టర్ విజయకుమార్ హత్యపై న్యాయ పోరాట కమిటీ ఏర్పాటైంది. బుధవారం ఐఎంఏ హాల్‌లో రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయసంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్టీరింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ నాయకులుగా జనవిజ్ఞాన వేదిక నేత జి.మాల్యాద్రి, పర్యావరణ పరిరక్షణ వేదిక నాయకుడు రమణయ్య, న్యాయవాదులు బ్రహ్మం, కె.శేషారెడ్డి, మలిరెడ్డి శ్రీనివాసులు, సిపిఐ నాయకులు పి.నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు. ఈ నెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు నెల్లూరు ఆసుపత్రి వద్ద డాక్టర్ విజయకుమార్ సంస్మరణ ఏర్పాటుచేస్తామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. డాక్టర్ విజయకుమార్ హత్యకేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. విజయకుమార్ ఆశయసాధన కోసం పేద ప్రజలకు సేవ చేసేందుకు ఏర్పాటు చేసిన నెల్లూరు ఆసుపత్రిని కొనసాగించేందుకు కమిటీ తోడ్పడుతుందని వారు పేర్కొన్నారు.

### గురుకుల కళాశాలలు 8న

జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలు జూన్8వతేదీ నుంచి పునఃప్రారంభమవుతాయని గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ టి.హేమలత తెలిపారు.

## దొంగబిల్లుల సంగతి తేల్చండి

**- ఆనం వివేకా డిమాండ్**



నెల్లూరు నగరపాలక సంస్థకు సంబంధించి జెరాక్స్ యంత్రాల్లో, పూడికతీత పనుల్లో, ట్రాక్టర్లు, ఆటోల మరమ్మతులకు సంబంధించి దొంగబిల్లుల విషయమై లెక్క తేల్చాలంటూ పిసిసి ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని కాంగ్రెస్ ఆఫీసులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్పొరేషన్‌లో దాదాపు రూ.5 కోట్ల బిల్లుల స్వాహాలోనూ, రామ్‌నగర్ ముస్లింల స్మశానస్థలం ఆక్రమణలోనూ మేయర్ అజీజ్‌కు సంబంధం వుందని ఆయన ఆరోపించారు. దీనిపై మేయర్ సమాధానం చెప్పాలన్నారు. నగరపాలక సంస్థ మేయర్ అజీజ్‌కు జేబు సంస్థలా మారిందని ఆయన విమర్శించారు. ప్రజాధనం దుర్వినియోగానికి సంబంధించి తాము ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా, తమవారి చేత తమను తిట్టిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బోడిగాడితోటలోని హిందూ స్మశానవాటికలో చెత్త ఎందుకు వేయిస్తున్నారని, ముస్లిం స్మశాన వాటికలో భవన నిర్మాణానికి ఎలా అనుమతించారని ఆయన ప్రశ్నించారు. తాము అడిగిన ప్రశ్నలకు మేయర్ సమాధానం ఇవ్వకపోతే, ఆ అక్రమాల్లో ఆయనకు భాగస్వామ్యం వున్నట్లే భావించాల్సివస్తుందని వివేకా అన్నారు. ఆనం వెంకటరమణారెడ్డి విమర్శలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, పచ్చని కుటుంబాన్ని వెంకటరమణారెడ్డి కుటుంబసభ్యులే చీల్చేశారని వివేకా విమర్శించారు. కుటుంబాన్ని తాము విడదీస్తున్నట్లు వెంకటరమణారెడ్డి విమర్శించడం బాధాకరమన్నారు. తామందరం కలిసే వుండేవారమని ఆయన అంటూ, విడిపోవడానికి కారణాలను వివరించారు. తమకు డబ్బున్నా, లేకున్నా, పదవి వున్నా లేకున్నా, తమ ఇంటిపేరుతో తాము మర్యాదగా బతుకుతున్నామన్నారు. ఈ సమావేశంలో ఏసీ సుబ్బారెడ్డి, రంగమయూర్‌రెడ్డి, మునాఫ్, షఫీ పాల్గొన్నారు.

## డబ్బుతో గబ్బు

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశంపార్టీ అన్ని విధాలుగా గబ్బుపట్టింది. పోటీ చేసిన ఒక్క ఎమ్మెల్సీని గెలిపించుకోలేక పోయింది. ఇక నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌ను తెలుగుదేశం అభ్యర్థి వేం నరేంద్రరెడ్డికి ఓటేసేలా 5కోట్లకు బేరమాడారు. రేవంత్‌రెడ్డి వ్యవహారం నడిపారు. అడ్వాన్స్ క్రింద స్టీఫెన్‌కు 50లక్షల నోట్ల కట్టలు ఇస్తూ ఏసిబి నిఘా కెమెరాలకు అడ్డంగా దొరికి పోయాడు. తన బాస్ పంపిస్తేనే వచ్చానంటూ ఆ వీడియో రికార్డులో రేవంత్‌రెడ్డి చెప్పడాన్ని బట్టి ఆ బాస్ అంటే చంద్రబాబేనని అందరూ అనుకుంటున్నారు.

రాజకీయాలలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను కొనడం కొత్తేమీ కాదు. సంతలో పశువుల్లాగా కొంటుంటారు. పి.వి.నరసింహారావు హయాంలో జెఎంఎం ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం తెలిసిందే! అలాగే యూపిఏ-1 ప్రభుత్వం అణుబిల్లును పార్లమెంటులో గట్టెక్కించడం కోసం వివిధ పార్టీల ఎంపీలను హోల్‌సేల్‌గా కొనుగోలు చేయడం చూసాం. ఇవి వెలుగులోకి వచ్చినవి మాత్రమే. వెలుగులోకి రానివి ఇంకా చాలా వున్నాయి. అయితే దొరికితేనే దొంగలవుతారు. ఇప్పుడు రేవంత్ కూడా అడ్డంగా దొరికిపోయాడు. తెలంగాణ తెదేపాలో రేవంత్‌రెడ్డిదే హవా. బాగా నోరున్న నాయకుడు. పార్టీని లీడ్ చేయాలని తహతహలాడుతున్నాడు. ఎమ్మెల్సీగా వేం నరేంద్రరెడ్డిని గెలిపించుకుంటే రేవంత్‌రెడ్డి ప్రతిష్ట పెరిగేది. తెలంగాణ తెలుగుదేశంలో ముఖ్య నాయకుడై వుండేవాడు. కాని దురదృష్టం వెంటాడి ఇలా దొరికిపోయాడు. ఏసిబికి ప్రత్యక్షంగా దొరికింది రేవంత్‌రెడ్డే అయినా ఈ సంఘటన ద్వారా అవినీతి, అక్రమాలను ప్రశ్నించే అవకాశాన్ని చంద్రబాబు కోల్పోయినట్లే!

# చదువుతోనే మంచి భవిష్యత్తు



చదువుతోనే మంచి భవిష్యత్తు వుంటుందని, ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకుని ఉన్నతశిఖరాలను అందుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి ఆకాంక్షించారు. మంగళవారం నెల్లూరులో జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జడ్పీ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల్లో అధికశాతం మంది పేదలే వుంటారని, వారికి చదువుతో పాటు మంచి భవిష్యత్తును చూపించాలని ఆమె ఉపాధ్యాయులను ఉద్దేశించి అన్నారు. ప్రతి విద్యార్థిలోనూ నైపుణ్యం వుంటుందని, వారి ప్రతిభకు మెరుగులు దిద్ది వారి భవిష్యత్తుకు వెలుగుబాట వేయాలన్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. జడ్పీ సమావేశమందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు మంచి చదువులు చదువుకుంటే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులకు మార్గదర్శి గైడు, క్రీడా పరికరాలను కూడా అందించామన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జడ్పీ పాఠశాలల విద్యార్థులు మరింత ఉత్తమ ఫలితాలు సాధించారని ఆయన ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించి, జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ. 15వేలు, రూ. 10 వేలు, రూ. 5వేలు వంతున నగదు బహుమతులను అందజేశారు. నియోజకవర్గాలవారీగా మొదటి మూడు స్థానాలు సాధించినవారికి రూ. 5వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు వంతున నగదు బహుమతిని అందజేశారు. జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి తన సొంత డబ్బులతో విద్యార్థులకు ఈ నగదు బహుమతులు అందజేసినట్లు జడ్పీ సిఇఓ జితేంద్ర తెలిపారు. అనంతరం నూరుశాతం ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ప్రతిభా విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులందజేశారు. ఈ కార్యక్రమంలో సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కె. సంజీవయ్య, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వై.వి.రామిరెడ్డి కుమార్తె వివాహం

నెల్లూరులో అన్ని రాజకీయ పక్షాల ప్రముఖులతో సన్నిహితంగా వుంటూ మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి కుడిభుజంగా వున్న జిల్లా ప్రణాళికా కమిటి మాజీ సభ్యులు వై.వి.రామిరెడ్డి – విజయ లక్ష్మిల కుమార్తె అఖిలరెడ్డి వివాహం తడ మండలం మాంబట్టు గ్రామానికి చెందిన వేనాటి హరిహరనాథరెడ్డి – జయంతిల కుమారుడు ప్రవీణ్‌రెడ్డితో ఈ నెల 4వ తేదీ నెల్లూరు సిపిఆర్ కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. అన్ని రాజకీయపార్టీల ప్రముఖులు, అధికారులు పెద్ద ఎత్తున సన్నిహితులు ఈ వేడుకకు విచ్చేసి వధూవరులను దీవించారు. కొత్తజంటకు 'లాయర్' శుభాకాంక్షలు.












# పర్యావరణ పరిరక్షణకు ప్రపంచం ఏకం కావాలి

## - న్యూయార్క్ సదస్సులో నెల్లూరు శాస్త్రవేత్త డా. జగదీష్





యుఎన్ అండర్ సెక్రటరీ జనరల్ డా. కాండీ యుంకెల్లాతో డా॥ జగదీష్

ప్రకృతిలో వస్తున్న పెనుమార్పులు, ఉష్ణోగ్రత పెరగడం వంటి వాటిపై ఇటీవల న్యూయార్క్‌లో జరిగిన ప్రపంచ శాస్త్రవేత్తల సదస్సులో సుదీర్ఘంగా చర్చించారు. వాతావరణ మార్పులను అధ్యయనం చేసి, ఈ పెనుమార్పులకు గ్లోబల్ వార్మింగ్ కారణమని, ప్రకృతిలో కార్బన్ డైయాక్సైడ్ శాతం అధికం అవుతుండడం వల్లే భూమి వేడెక్కిపోయి వేసవి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఎన్నో ఏళ్ళుగా ఈ అంశంపై జరుగుతున్న పరిశోధనల నివేదికను కూడా ఈ సందర్భంగా చర్చించారు. ఐక్యరాజ్య సమితి నెలకొల్పిన 'సస్టైనబుల్ ఎనర్జీ ఫర్ ఆల్' 2వ ఫోరం సదస్సు గత నెల 18 నుంచి 21వ తేదీ దాకా న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో జరిగింది. యుఎన్ అండర్ సెక్రటరీ జనరల్ డా. క్యాండీ యుంకెల్లా ఈ సదస్సుకు ఛైర్మెన్‌గా వ్యవహరించారు. పలుదేశాల నుంచి సుమారు 2500 మందికిపైగా ప్రతినిధులు, వివిధ దేశాల మంత్రులు, ఐక్యరాజ్యసమితి, వరల్డ్ బ్యాంక్, ఎఫ్ఏఓ తదితర అంతర్జాతీయ సంస్థల ప్రముఖులు ఈ సదస్సులో పాల్గొన్నారు. మనదేశం నుంచి ప్రత్యేక ప్రతినిధిగా నెల్లూరీయులైన ప్రఖ్యాత ప్రత్యామ్నాయ ఇంధన వనరుల శాస్త్రవేత్త డా. ఏ.జగదీష్ పాల్గొని తన అభిప్రాయాలను కూడా వెల్లడించారు. అధిక ఉష్ణోగ్రతల నివారణకు పలు మార్గాలను కూడా ఈ సందర్భంగా డా. జగదీష్ తన పరిశోధనా పత్రంలో వివరించి, సదస్సుకు సమర్పించినట్లు ఆయన తెలిపారు. స్వల్పమైన జాగ్రత్తలు తీసుకున్నా చాలు.. అధిక ఉష్ణోగ్రతలను బాగా తగ్గించుకోవచ్చని తాము చేసిన సూచనలను శాస్త్రవేత్తలందరూ ప్రశంసించారని ఆయన తన పరిశోధనాంశాలను ఈ సందర్భంగా తెలియజేశారు. ఆ వివరాలిలా వున్నాయి.

### కలబంద, నాగజెముడు మొక్కల సాగుతో ఎన్నో ప్రయోజనాలు :

సాధారణంగా మనకు లభించే కలబంద, నాగజెముడు మొక్కలతోనే అధిక ఉష్ణోగ్రతలను నివారించుకోవచ్చని, వాటి వల్ల మరెన్నో ఉపయోగాలు కూడా వున్నాయని డా. జగదీష్ తెలిపారు. ఇప్పటికీ మనదేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది తమ ఇళ్ళలో కలబంద, నాగజెముడు మొక్కల ముక్కలను 'దిష్టి' తగలకుండా వుండేందుకని, ఇళ్ళ వాకిళ్ళ ముందు వేలాడగడుతుంటారని, అయితే ఇందులో ఎంతో శాస్త్ర విజ్ఞానం కూడా వుందని ఆయన పేర్కొన్నారు. ఇవి చాలా సులభంగా, ఏపుగా పెరుగుతుంటాయన్నారు. ఈ మొక్కలు రాత్రివేళల్లో ప్రకృతిలోని కార్బన్‌డైయాక్సైడ్‌ను గ్రహించి, ఫోటోసింథసిస్(కిరణజన్య సంయోగక్రియ)కు తోడ్పడతాయని, క్యామ్ (సిఎఎం) మొక్కలుగా ప్రసిద్ధి చెందిన ఈ మొక్కలు తక్కువ వర్షపాతం వున్న ప్రాంతాల్లోనూ, చివరికి ఎడారుల్లో సైతం పెరుగుతాయనీ ఆయన పేర్కొన్నారు. సారం లేని భూముల్లో కూడా ఇవి బాగా పెరుగుతాయని, ఈ మొక్కలను విస్తారంగా పెంచడం ద్వారా ప్రకృతిలోని కార్బన్‌డైయాక్సైడ్ శాతాన్ని తగ్గించడమే కాక, ప్రకృతిలో పలు మార్పులను, అధిక ఉష్ణోగ్రతలను బాగా తగ్గించుకోవచ్చని ఆయన సూచించారు. అంతేకాక, ఈ మొక్కల నుంచి బయోగ్యాస్, బయోఫ్యూయల్ కూడా తయారుచేసుకోవచ్చని, మెక్సికోలో వీటిని తయారుచేస్తున్నారని ఆయన ఉదహరించారు. ముఖ్యంగా మన దేశంలో కోట్లాది కిలోమీటర్ల వృధా భూములు, ఖాళీభూములు వున్నాయి కనుక, ఆ భూముల్లో ఈ మొక్కలను విస్తారంగా సాగుచేసుకునేందుకు యువతకు అవకాశం కల్పిస్తే, నిరుద్యోగ యువతకు ఉపాధి కూడా కల్పించినట్లవుతుందన్నారు. అదే విధంగా, కాలువల్లో ఏపుగా పెరిగే గుర్రపుడెక్కను మనం ఇక్కడ ఒక సమస్యగా భావించవచ్చు కానీ, ఈ గుర్రపుడెక్కతో ఇండొనేషియా, థాయ్‌ల్యాండ్, వియత్నాం తదితర దేశాల వారు ఫర్నీచర్ తయారు చేసి వివిధ దేశాలకు ఎగుమతి చేస్తున్నారని ఆయన వివరించారు. మన రాష్ట్రంలోని కొల్లేరు సరస్సులో దాదాపు 2 వందల కిలోమీటర్ల విస్తీర్ణంలో ప్రతిఏటా 10 నెలల కాలంలో ఈ గుర్రపుడెక్క పుష్కలంగా వుంటుందని, దీనిని ఉపయోగించి బయోగ్యాస్, ఫర్నీచర్ తయారుచేసుకోవచ్చని ఆయన సూచించారు. ప్రభుత్వం ఈ విషయాలను పరిశీలించి, వీటి తయారీకి ప్రోత్సహిస్తే యువతకు ఎంతో ఉపాధి కలుగుతుందని, మరోవైపు బయోగ్యాస్ ఇంధనశక్తిని బాగా ఉత్పత్తి చేసుకోవచ్చనీ ఆయన సూచించారు. తాను ఆ మేరకు రూపొందించిన ప్రణాళికను, పరిశోధనా పత్రాన్ని సమర్పించగా, ఈ సదస్సుకు విచ్చేసిన అంతర్జాతీయ స్థాయి నిపుణులు ఆ సూచనలను పరిశీలించి తనను ప్రశంసించారని ఆయన పేర్కొన్నారు. మన ప్రభుత్వాలు కూడా ఈ అంశాలను పరిశీలించి, ప్రతి ఏటా పెరిగిపోతున్న అధిక ఉష్ణోగ్రతలను కొంతమేరకైనా తగ్గించుకునేందుకు ఈ మొక్కల సాగును విస్తారంగా చేపట్టేందుకు యువతకు తగు ప్రోత్సాహం అందివ్వాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.





# 'ప్రభా'తం

రాను రాను రాజకీయాలు ఎంతగా భ్రష్టుపట్టిపోతున్నాయో తెలియజెప్పేందుకు తాజా ఉదాహరణే రేవంత్ వ్యవహారం. పదవులే పరమావధిగా, అడ్డదారిలోనైనా సరే గెలవడమే ప్రధానంగా భావిస్తూ తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే, తెలంగాణాలో ఒక ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకోసం ఒక నామినేటెడ్ ఎమ్మెల్యేకి నోట్ల కట్టలు ఎరజూపడం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం కలిగించింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు కోసం నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్సన్‌కు రూ.50 లక్షలు ఇవ్వజూపుతుండగా టీడీపీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఏసిబి అధికారులకు పట్టుబడడం రాజకీయ రంగంలో తుఫాన్ సృష్టిస్తోంది.

హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన ఈ వ్యవహారంలో రేవంత్‌రెడ్డి, నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్సన్ ఓటు కోసం నోట్ల కట్టలతో బేరాలాడడం చూస్తే మన ప్రజాస్వామ్యం ఎంతగా అపఖ్యాతికి గురవుతుందో తేటతెల్లమవుతోంది. ఆ మాటల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పేరు కూడా ప్రస్తావనకు రావడంతో ఈ వ్యవహారం మరింత పెద్దదైంది. దీంతో అటు టిడిపిపై, ముఖ్యమంత్రి చంద్రబాబుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రేవంత్ మాట్లాడిన మాటలను, రూ.50లక్షలు అడ్వాన్సుగా ఇస్తూ జరిపిన సంభాషణలను అన్నిటినీ ఏసిబి అధికారులు అత్యంత పకడ్బందీగా రహస్య కెమెరాల్లో నమోదు చేయడంతో ఈ వ్యవహారం బట్టబయలైంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పంపిస్తేనే తాను వచ్చానన్న రేవంత్ వ్యాఖ్యలను కూడా ఏసిబి అధికారులు పరిగణనలోకి తీసుకుని మొత్తం వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపేందుకు సంకల్పించినట్లు తెలుస్తోంది. ప్రజాస్వామ్య విలువలకే తలవంపులు తెచ్చే ఈ సంఘటనతో తెలుగు రాష్ట్రాలు అట్టుడికిపోతున్నాయి. నోటుకు ఓటు.. ప్రజాస్వామ్యానికే చేటు అనే విషయం మన నాయకులకు తెలియదనుకోలేం. మరి తెలిసి తెలిసీ ఇంత బరితెగింపుగా వుండడం చూస్తే, ఎవరికైనా సరే రాజకీయాల పట్ల ఏవగింపు కలుగుతుంది. తెలుగుజాతి ఖ్యాతిని, ఆత్మగౌరవాన్ని అంతర్జాతీయస్థాయిలో చాటుతామన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఈ వ్యవహారంలో ఏమేరకు పాత్ర వుందనే విమర్శలు కొల్లలుగా వస్తున్నాయి. ఆ విషయం నిర్ధారించడానికి సమయం పట్టినా, రేవంత్ వ్యాఖ్యలు, ఓటు కోసం డబ్బు మూటలు విప్పడాలు వగైరాలన్నిటినీ టీవీల్లో, పత్రికల్లో చూసే సామాన్యులకు మాత్రం.. రాజకీయాలు మరీ ఇంతగా దిగజారిపోయాయా?.అనే ఆవేదన కలుగుతోంది. అందులోనూ ఒక్క ఓటు కోసం 5 కోట్లు ఆఫర్ ఇచ్చి, అడ్వాన్స్‌గా రూ. 50 లక్షల అడ్వాన్స్ ఇవ్వడానికి సిద్ధపడడమంటే మాటలా?.. అయినా, ఇంతింత భారీ మొత్తాలనైనా సరే ముడుపులుగా ఇచ్చి, తమకు కావాల్సినవారిని అందలం ఎక్కించేందుకు ప్రయత్నిస్తున్నారంటే ఎంత దారుణం?.. ఇదేమి రాజకీయం?.. అసలు అంతంత డబ్బు వారికి ఎలా?.. ఎక్కడ నుంచి వస్తోంది?.. ఇలాంటి ప్రశ్నలే అందరిలోనూ. అయినా, ఇదంతా కెసిఆర్ తనను ఇరికించడానికి చేస్తున్న ప్రయత్నమేనంటూ రేవంత్ అంటున్నప్పటికీ, అందుకు మద్దతుగా ఇది కెసిఆర్ కుట్రేనని టిడిపి వారు ధర్నాందోళనలు చేస్తున్నప్పటికీ, కళ్ళ ముందు కెమెరాలు బట్టబయలు చేసిన సమాచారాన్ని చూసినవారెవరూ ఆ మాటలను నమ్మే స్థితిలో లేరు. ఇది కేవలం ఒక్క ఎమ్మెల్యే రేవంత్ చేసిన తప్పిదమా?.. లేక తెలుగుదేశం పార్టీ వెనుకనుండి నడిపించిన వ్యవహారమా?..అన్నది కూడా ఇప్పుడు సర్వత్రా పెద్ద చర్చనీయాంశంగా వుండడం గమనార్హం. ఏ సభ పెట్టినా అవినీతి భరతం పడతామనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇలా ఏసీబీకి అడ్డంగా దొరికిపోయిన రేవంత్ వ్యవహారంలో మాత్రం ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా మౌనంగానే వుండడం మరిన్ని విమర్శలకు తావిచ్చినట్లవుతోంది. మొత్తమ్మీద ఈ వ్యవహారంలో నిజానిజాలను నిగ్గు తేల్చేందుకు పూర్తిస్థాయి విచారణకు ఏసిబివారు సమాయత్తమవుతున్న నేపథ్యంలో, తీగలాగితే డొంకంతా కదలబారుతున్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక ఆధారాలను బట్టి రేవంత్ జైలుకు వెళ్ళడం, సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం కూడా జరిగిపోయినా, ఈ ముడుపులు ఎరజూపిన విషయం వెనుక ఇంకా మరెన్ని ప్రత్యక్ష పరోక్ష హస్తాలున్నాయో.. ఎవరెవరికి ఎంతెంత పాత్ర వుందో పూర్తిస్థాయి విచారణలో తప్ప తేలవు. ఇదిలావుంటే, అసలే విభజన కష్టాలతో రాష్ట్రం పరిస్థితి అయోమయంగా వుంటే మధ్యలో ఈ బాగోతమొకటి. రాష్ట్ర ఆర్థికరంగాన్ని చక్కదిద్ది ఒక గాడిన పెట్టి, ప్రగతిలో పరుగులు తీయించాల్సిన సమయమిది. మరోవైపు, రాజధాని నిర్మాణం కోసం చేయాల్సిన కసరత్తు చాలానే వుంది. ఇంకోవైపు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించుకోవాల్సి వుంది. ఇంతటి బృహత్తర విషయాలను ఓ కొలిక్కి తీసుకురావాల్సిన వేళ..ఇలాంటి సంఘటన ప్రజాస్వామ్యానికే మాయని మచ్చగా మిగిలింది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన నాయకులే ఇలా ప్రజాస్వామ్య విలువలను మంట కలుపుతుండడం పట్ల సర్వత్రా ప్రజల్లో ఆవేదన, అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి. ఏడాది పాలనలో రాష్ట్రం ఇంకా సమస్యల సుడిగుండాల్లోనుంచి బయటపడకపోయినా, ఇలాంటి ఘటనలు టిడిపికి మరింత నష్టదాయకమైనవేనని చెప్పవచ్చు. ఇదే అదనుగా అటు వైఎస్సార్సీపి, ఇటు కాంగ్రెస్ పార్టీలు టిడిపి ఎమ్మెల్యే తీరునే కాక, టిడిపి విధానాలను, ముఖ్యంగా ఇందులో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమేయం ఏమేరకు వుందో తేల్చాలంటూ చేస్తున్న విమర్శనాస్త్రాలను చూస్తుంటే, భవిష్యత్తులో ఇది టిడిపికి మరింత ఇబ్బందిగా మారే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు ఈ వ్యవహారంపై బిజెపి నేతలు కూడా సీరియస్‌గానే వున్నట్లు తెలుస్తోంది. దీంతో, ఈ రెండు పార్టీల మధ్య ఈ సంఘటన ప్రభావం ఎలా వుంటుందోననే విషయం కూడా సర్వత్రా చర్చనీయాంశంగా వుంది. ఇంతగా పీటముడి వేసుకుపోతున్న ఈ వ్యవహారం చివరికి ఏ మలుపు తిరుగుతుందో మరి!...

## ప్రజాస్వామ్యానికే మచ్చ



ఒక్క ఎమ్మెల్సీ ఓటు కోసం పెద్ద మొత్తంలో నోట్ల కట్టలు ఎరజూపి టిడిపి ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఏసిబి నిఘా కెమెరాలకు అడ్డంగా దొరికిపోవడం రాష్ట్రంలో సంచలనం కలిగించింది. ఈ సంఘటన ప్రజాస్వామ్యానికే మాయని మచ్చగా మిగిలింది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన నాయకులే.. ఇలా ప్రజాస్వామ్య విలువలను మంట కలుపుతుండడం పట్ల సర్వత్రా ప్రజల్లో తీవ్ర ఆవేదన, అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి.

# పాలిటెక్నిక్ కళాశాలలో సౌరశిక్షణ

నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్న నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో సోలార్ పి.వి.ఇన్‌స్టాలర్స్ శిక్షణను ఈ నెల 10 నుంచి ప్రారంభిస్తున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వై.రామమోహనరావు తెలిపారు.

సోమవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంకేతిక విద్యావిభాగం ఆధ్వర్యంలో జిల్లా యువత కోసం ఈ టెక్నీషియన్ స్థాయి కోర్సును మూడునెలల శిక్షణతో అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సులో చేరదలచుకున్న యువత 7వ తరగతి ఆపైన విద్యార్హత కలిగి వుండాలని, 19 నుండి 24సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. శిక్షణ పూర్తయిన వెంటనే ఉద్యోగవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సోలార్ మెగాప్లాంట్లలో అవకాశాలు ఉన్నాయని, దీనికి సంబంధించి సోలార్ ఒకేషన్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సోలార్ వినియోగానికి ప్రాధాన్యం చూపుతున్న నేపథ్యంలో ముందస్తుగా నిపుణులను తయారు చేయడంలో భాగంగా ఈ శిక్షణను సాంకేతిక విద్యావిభాగం నిర్వహిస్తోందన్నారు. కేంద్రప్రభుత్వం 2వేల సోలార్ నీటి పంపులు మంజూరు చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం 3వేల మెగావాట్‌ల సామర్థ్యంగల సోలార్ పవర్‌ప్లాంట్లను పెట్టబోతోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం రూఫ్‌టాప్ సోలార్ పవర్ ప్యాక్ పథకాన్ని అమలు చేయబోతోందని, పివి ఇన్‌స్టాలర్స్ నిపుణులు వుంటేనే ఇది అమలు జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 8886677089, 9849203455 నెంబర్లలో సంప్రదించా లన్నారు. ఈ సమావేశంలో సోలార్ ఒకేషన్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ మేనేజింగ్ పార్టనర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.


# ఆర్టీసీ అద్దె బస్సులు రెడీ

వివాహాలకైనా, విహారయాత్రలకైనా సరే ఆర్టీసీ అద్దెబస్సులు రెడీ అంటున్నారు ఆర్టీసీవారు. గత శనివారం నెల్లూరులోని ఆర్టీసీ డిపో-1 మేనేజర్ సుబ్రహ్మణ్యం విలేకరులతో మాట్లాడుతూ, ఈ సంగతి చెప్పారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సూపర్ డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు అందుకు సిద్ధంగా వున్నాయని, పల్లె వెలుగు బస్సుకు 330 కిలోమీటర్ల దూరానికి అద్దె 11,850 రూపాయలను చెల్లించాలని, అంతకంటే అదనంగా తిరిగితే ప్రతి కిలోమీటర్‌కు రూ.35 అదనంగా చెల్లించాలని ఆయన తెలిపారు. అదేవిధంగా, ఎక్స్‌ప్రెస్ బస్సుకు 330 కిలోమీటర్లకు గాను రూ.13,380 చెల్లించాలని, అదనంగా తిరిగే ప్రతి కిలోమీటర్‌కు రూ.41 అదనంగా చెల్లించాలన్నారు. డీలక్స్ బస్‌లకైతే రూ.12,550 చెల్లించాలని, అదనంగా ప్రతి కిలోమీటర్‌కు రూ.37 చెల్లించాలన్నారు. సూపర్ లగ్జరీ బస్‌కు రూ. 12,840 చెల్లించాలని, అదనపు కిలోమీటర్లు తిరిగితే రూ. 38 వంతున అదనంగా చెల్లించాలని పేర్కొన్నారు. పల్లెవెలుగు బస్సుకు 54 సీట్లు, ఎక్స్‌ప్రెస్‌కు 50 సీట్లు, డీలక్స్‌కు 40, సూపర్ లగ్జరీబస్‌కు 36 సీట్లు వుంటాయన్నారు. అద్దె బస్సులు కావాలనుకునేవారు ఆంధ్రప్రదేశ్ వరకు అయితే ఒక రోజు ముందు, ఇతర రాష్ట్రాలకు నాలుగు రోజులు ముందుగా రిజర్వ్ చేసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల పర్మిట్ కోసం రూ. 500 అదనంగా చెల్లించాల్సి వుంటుందని ఆయన పేర్కొన్నారు.

# క్రైస్తవుల సమాధుల తోటకు స్థలం చూపండి



క్రైస్తవులకు సమాధులతోట లేక దాదాపు 230సంవత్సరాల నుండి ఇబ్బందులు పడుతున్నారని సమాధులతోటకు స్థలం మంజూరు చేయాలంటూ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు క్రొత్త ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో గత నెల 30వ తేదీ నెల్లూరు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అమూల్య స్వచ్ఛంధ సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు టి.టోనీబాబు, క్రిస్టియన్ వెల్ఫేర్ సంఘం గౌరవఅధ్యక్షులు టి.కిరణ్, సభ్యులు వెంకి, నాని, సతీష్, కిరణ్, సంప్రీత్ తదితరులు పాల్గొన్నారు.




## ఉద్యోగుల బదిలీలు

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీలకు శ్రీకారం చుట్టింది. తత్ఫలితంగా ఒకే చోట ఐదు సంవత్సరాలుపైగా పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేసేందుకు అవకాశం కలిగింది. అయితే అన్ని స్థాయిల బదిలీలు 20శాతంలోగా చేయవలసి ఉంటుంది. అందుకుగాను కౌన్సిలింగ్ ప్రక్రియ ఏర్పాటు చేయబడింది. కౌన్సిలింగ్‌లో ఉద్యోగుల సంక్షేమ అంశాలను పరిగణనలోకి తీసుకొని తదుపరి బదిలీలు చేయవలసి వుంది. అయితే కొంతమంది ఉద్యోగులు కౌన్సిలింగ్ ఉన్నప్పటికి, ఒకే చోట నియామకం చేయబడి రిటైర్ అయ్యేంతవరకు అక్కడే కొనసాగుతున్నారు. పరస్పర ఒప్పంద బదిలీలకు కూడా ఐదు సంవత్సరాల సర్వీసు పరిగణలోనికి తీసుకోవాలి. వ్యక్తిగత ప్రయోజనాలను నివారించటం, నిజాయితీని పెంపొందించడం బదిలీల యొక్క ముఖ్య ఉద్దేశ్యం. రాజకీయ జోక్యాలు, ఉద్యోగసంఘాల జోక్యం ఉన్నప్పటికీ బదిలీలు పారదర్శకంగా ఉంటాయని చాలామంది ఉద్యోగులు విశ్వసిస్తున్నారు.

**- రావూరి సురేంద్రనాథ్, నెల్లూరు.**

## గోవధను నిషేధించాలి

దేశ వ్యాప్తంగా గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి. ఈ దేశంలో మెజార్టీ మతస్తుల మనోభావాలను అందరూ గౌరవించాలి. హిందువులకు గోవు ఆరాధనీయ జంతువు. ప్రజలకు ఉపయోగపడే జంతువు కూడా! పశు మాంస ఎగుమతిలో భారతదేశం ప్రథమస్థానంలో ఉండడం విచారకరం. పశుమాంసం ఎగుమతి బదులు వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తుల్లో అగ్రస్థానానికి వస్తే బాగుంటుంది.

**ముప్పాళ్ల నాగేశ్వరప్రసాద్, కావలి.**

## సంతలో పశువులా?

చంద్రబాబు రంగు బయటపడింది. ఆంధ్రాలో సంపాదించిన డబ్బులతో తెలంగాణలో ఎమ్మెల్యేలను కొంటున్నాడు. తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌ను 5కోట్లకు బేరమాడి అడ్డంగా దొరికిపోయారు. అతిగా నోరు పారేసుకునే రేవంత్‌రెడ్డి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. నిద్రలేస్తే నీతులు చెప్పే చంద్రబాబు మరి దీనిగురించి ఏమంటాడో?

**సి.అశోక్‌రెడ్డి, నెల్లూరు.**

## తెలుగుతమ్ముళ్ళనందరినీ ఒకే వేదికపై నిలిపిన

# నవనిర్మాణ దీక్ష



రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది అయ్యింది. ఈ ఏడాదికాలంగా జిల్లాలోని తెలుగుదేశం నాయకులందరూ వర్గాలవారీగా ఎడముఖం పెడముఖంగానే ఉంటున్నారు. ఒకరికొకరికి పడడం లేదు. ఒకరి క్రిందకు ఒకరు నీళ్ళు తెచ్చే పనులు పెట్టుకుంటున్నారు. ముఖ్యంగా నారాయణ మంత్రి కావడం మిగతా నాయకులకు పెద్దతలనొప్పిగా మారింది. ఈ ఏడాది కాలంలో విభేదాలను మరచి, వీరంతా ఒక వేదికమీదకు చేరింది లేదు. ఎట్టకేలకు ఏడాది తర్వాత నవ నిర్మాణ దీక్ష వేదిక ద్వారా ఆ లోటు తీరింది. మంగళవారం నెల్లూరు విఆర్‌సి మైదానంలో నిర్వహించిన నవనిర్మాణ దీక్షలో విభేదాలను మరచి నాయకులంతా పాల్గొన్నారు.

ఈ సభలో మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రగతే ధ్యేయంగా కృషి చేస్తున్నారని, ఆర్థిక వ్యవస్థను చక్కదిద్ది రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు అహరహం శ్రమిస్తున్నారని, దేశంలోనే మన రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా చేసేందుకు ముఖ్యమంత్రి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. పేదరికం నిర్మూలనకు, సామాన్యుడికి ఆర్థిక స్వావలంబన కలిగించేందుకు, జిల్లా ప్రగతితో పాటు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి నవనిర్మాణ దీక్ష ప్రధాన లక్ష్యమని అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో సమ న్యాయం జరగలేదని, రాష్ట్రానికి 90 వేల కోట్లు అప్పులు వచ్చాయని ఆయన ఆవేదనతో అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భారీ లోటు బడ్జెట్‌లో వున్న రాష్ట్రాన్ని ప్రగతి దిశలో నడిపేందుకు ఎంతో చొరవ చూపుతున్నారన్నారు. రాష్ట్రానికి విద్యుత్ సమస్య లేకుండా చేశారని, రైతులకు దాదాపు 35 వేల కోట్లు రుణమాఫీ చేశారని ఆయన అన్నారు. మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తి ఒక్క చంద్రబాబుకే వుందన్నారు. మాజీమంత్రి ఆదాల ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ, విభజనతో రాష్ట్రం ఎంతో నష్ట పోయినా, తాను చెప్పిన మాటలకు కట్టుబడి రుణమాఫీ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎం.జానకి మాట్లాడుతూ, కలసికట్టుగా అందరం రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, నెల్లూరు నగరానికి తాగునీరు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థల కోసం వెయ్యికోట్ల నిధులను మంజూరు చేయించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కేంద్రమంత్రి వెంకయ్య నాయుడుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసమే నవనిర్మాణ దీక్ష చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి రమేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, సీమాంధ్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సిహెచ్ రవీంద్రబాబు, రాష్ట్ర మహిళానాయకురాలు టి.అనూరాధ, ఏజెసి రాజ్‌కుమార్, డిఆర్‌ఓ సుదర్శన్‌రెడ్డి, ఏఎస్పీ గంగాధర్, టిడిపి నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు, చాట్ల నరసింహారావు, డిసిసిబి ఛైర్మెన్ ధనుంజయరెడ్డి, డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇక షార్ సారథి...

# కున్హికృష్ణన్



నెల్లూరుజిల్లా శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగకేంద్రం (షార్ సెంటర్) నూతన డైరెక్టర్‌గా కున్హికృష్ణన్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన కేరళవాసి. షార్‌తో ఎంతో అనుబంధముంది. 1986లో విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో ఇస్రో ఉద్యోగిగా చేరారు. అక్కడనుండి ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చారు. ఇప్పటి దాకా ఆయన 11పిఎస్‌ఎల్‌వి మిషన్‌లకు డైరెక్టర్‌గా వ్యవహరించడం విశేషం. మంగళయాన్ ఉపగ్రహాన్ని ప్రయోగించిన పిఎస్‌ఎల్‌వికి కూడా ఆయనే డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఆయన సారధ్యంలో ప్రయోగించిన రాకెట్లన్నీ కూడా విజయవంతమయ్యాయి.

కాగా 2012 డిసెంబర్ 31 నుండి షార్ డైరెక్టర్‌గా పనిచేసిన తెలుగువాడు, పశ్చిమగోదావరి జిల్లా వాసి యం.వై.యస్.ప్రసాద్ మే31వ తేదీన పదవీ విరమణ చేసారు. 2013జూన్ నాటికే ఆయన రిటైర్డ్ కావాల్సి వున్నప్పటికీ ఆయన సేవలు అవసరం దృష్ట్యా కేంద్రప్రభుత్వం 2015 జూన్ దాకా ఆయన పదవీ కాలాన్ని గతంలోనే పొడిగించింది. ఆయన సారధ్యంలో షార్‌లో ఎన్నో అభివృద్ధి పనులు జరగడంతో పాటు కీలకమైన ప్రయోగాలు జరగడం మరపురాని జ్ఞాపకాలు కానున్నాయి.

# అడ్డగోలు జిఓపై కోర్టుకెక్కిన బొమ్మిరెడ్డి



జిల్లా పరిషత్ పరిధిలో జరగాల్సిన ఉద్యోగుల బదిలీ వ్యవహారాలలో వేలుపెట్టడం కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓ నెం.57పై నెల్లూరు జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి హైకోర్టుకెక్కాడు. ఆ జిఓను తాత్కాలికంగా నిలిపివేస్తూ స్టే తెగలిగాడు. ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం జిఓ నెంబర్ 57ను విడుదల చేసింది. ఈ జిఓ ప్రకారం బదిలీలు డిస్ట్రిక్ట్ లెవల్ కమిటీ ఆధ్వర్యంలో జరగాలి. అంటే అధికారపార్టీ నాయకుల ఇష్టానుసారంగా బదిలీలు చేసుకోవచ్చు. జిల్లా పరిషత్ పరిధిలోకి వచ్చే ఉద్యోగుల బదిలీలలో కూడా అధికారపార్టీ నేతల హవా సాగుతుంది. ఈ జిఓ ప్రకారం అధికార పార్టీ జడ్పీ ఛైర్మెన్‌ల హవా నడిచినా ప్రతిపక్ష జడ్పీ ఛైర్మెన్‌లు డమ్మీలుగా మారే అవకాశముంది. దీంతో బొమ్మిరెడ్డి బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలంటూ హైకోర్టుకెళ్లి స్టే తెచ్చారు.

# సవాళ్లు, సమస్యల మధ్య కసరత్తు

## కొత్త కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పివివిఎస్ మూర్తి



నెల్లూరుజిల్లాకు ఏ పోస్టులో రావాలన్నా అధికారులు హుషారుగా వస్తారు. ఒక్క నెల్లూరు నగరపాలక సంస్థకు కమిషనర్‌గా రావాలంటే మాత్రం అంత ఉత్సాహం చూపించరు. దీనికి కారణం నెల్లూరు ఎంత మురికిగా ఉంటుందో నెల్లూరు కార్పొరేషన్ రాజకీయాలు కూడా అంతే మురికిగా వుంటాయి. కమిషనర్లుగా వచ్చిన వాళ్లెవరూ ఇక్కడ గట్టిగా ఒకట్రెండేళ్లు కూడా పని చేయలేదు. గత పదిహేనేళ్లుగా చూస్తే ఒక్క టిఎస్‌ఆర్ ఆంజనేయులు తప్పితే ఇంకెవరూ ఇక్కడ ఎక్కువకాలం నిలవలేక పోయారు. ముఖ్యంగా ఆరునెలలకు ఓ కమిషనర్ మారుతుంటాడనే మహా చెడ్డపేరు నెల్లూరు నగరపాలక సంస్థకు ఉండడం విశేషం. అంతెందుకు రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిలోనే నెల్లూరుకు ముగ్గురు కమిషనర్లు మారడం విశేషం. గత ఐఏఎస్ కమిషనర్ చక్రధర్‌బాబును అయితే అన్యాయంగా ఆరునెలలకే బదిలీ చేశారు.

నెల్లూరు నగరపాలక సంస్థ కొత్త కమిషనర్‌గా పివివిఎస్ మూర్తి మే 30వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు కమిషనర్‌గా మంచిపేరు తెచ్చుకున్న మూర్తికి అసలు అగ్నిపరీక్ష ఇక్కడే ఉండబోతోంది. ఇక్కడ నాయకులతో వేగడమే ఆయనకు పెద్దపని. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో కమిషనర్‌గా పనిచేసిన ఆంజనేయులు అన్ని పార్టీల వారితోనూ సన్నిహితంగా వుంటూ లౌక్యంగా లాక్కొచ్చారు. నగరంలో పనులను కూడా అదే స్థాయిలో చేయించారు. కమిషనర్‌గా వచ్చిన మూర్తి కూడా లౌక్యంగా వ్యవహరిస్తూ, అడ్డగోలు పనులను సుతిమెత్తగా పక్కకు తప్పిస్తూ పోవాలి. ముఖ్యంగా మేయర్, కమిషనర్‌కు మధ్య సమన్వయం కుదిరితేనే కార్పొరేషన్‌లో ఏవన్నా పనులు జరిగే అవకాశముంది. లక్షలు ఖర్చు పెట్టి గెలిచిన చాలామంది కార్పొరేటర్లు బాగా ఆకలితో ఉన్నారు. ఏ చిన్న సందు దొరికినా వదిలిపెట్టడం లేదు. కార్పొరేషన్‌లో అక్రమాలకు పూర్తిగా చెక్ పెట్టాల్సిన బాధ్యత కమిషనర్‌దే! అలాగే బాగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న టౌన్ ప్లానింగ్ విభాగాన్ని కూడా దారిలో పెట్టాల్సి వుంది. నెల్లూరు కార్పొరేషన్‌లో భూగర్భ డ్రైనేజీకి, తాగునీటికి 1100కోట్లు హడ్కో ఋణం మంజూరైన నేపథ్యంలో ఆ నిధులలో ప్రతి పైసాను సద్వినియోగం చేయాల్సిన గురుతర బాధ్యత మూర్తి మీదే వుంది.

ఇక నగరంలో చూస్తే డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీళ్లు, పందులు, కోతుల బెడద, రిజర్వు స్థలాల ఆక్రమణలు వంటి సమస్యలున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణలోనూ, చెత్త తరలింపులోనూ అనేక సమస్యలున్నాయి. ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికుల చేత విధులు నిర్వహించడం ప్రధాన అంశం. నగరంలో ఆస్థి పన్నులు గందరగోళంగా ఉన్నాయి. వీటిపై కూడా ఆయన దృష్టిపెట్టాల్సి వుంది. సమయస్ఫూర్తితో పనిచేసుకుంటూ పోతే ఈ సమస్యలను, సవాళ్లను సులభంగా దాటుకునే అవకాశముంది. బెస్టాఫ్‌లక్ మూర్తి.


బ్రహ్మయ్య కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్
Affiliated to JNT University, Anantapur and Approved by AICTE, New Delhi
ఎన్‌హెచ్-5, నార్తురాజుపాలెం, కొడవలూరు మండలం, నెల్లూరు జిల్లా
సెల్: 7207207072, 9642346686, 9963188292 ఫ్యాక్స్: 08622-215218

Courses Offered :

B.TECH
CIVIL - 60
MECH - 60
ECE - 180
EEE - 120
CSE - 60

M.TECH
M.TECH (POWER ELECTRONICS)
M.TECH (MACHINE DESIGN)
M.TECH (COMPUTER SCIENCE ENGINEERING)

M.B.A
MBA - 180

Diploma Courses
CIVIL - 60
MECH - 60

- జిల్లాలోనే ప్రప్రథమంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో విశాలమైన గదులలో విద్యాబోధన
- అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యా బోధన
- చాప్టర్‌వైజ్‌గా జెఎన్‌టియూ తరహాలో పరీక్షల నిర్వహణ
- అత్యాధునిక వసతులతో విశాలమైన ల్యాబొరేటరీ సౌకర్యం
- 24 గంటల డిజిటల్ లైబ్రరీ సదుపాయం
- విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ సదుపాయం
- రుచికరమైన భోజనం కలిగిన మెస్ సదుపాయం
- 24 గంటలు మినరల్ వాటర్ సౌకర్యం
- జిల్లా నలుమూలల నుండి బస్సు సౌకర్యం
- అనుభవజ్ఞులైన డాక్టర్లచే వైద్య చికిత్స
- అద్భుతమైన ఉపాధి అవకాశాలు
- వైఫై ఇంటర్నెట్ సౌకర్యం * సువిశాలమైన క్రీడా ప్రాంగణం


G.BRAHMAIAH
Chairman& President

- ఇంటర్‌లో 900 పైన మార్కులు వచ్చి, ఫీజు రీఎంబర్స్‌మెంట్ కలిగిన విద్యార్థులకు బ్రహ్మయ్య ఇంజనీరింగ్ కళాశాలలో 4 సం॥లు హాస్టల్‌లో ఉచిత భోజన సదుపాయం కలదు.
- హాస్టల్‌లో చేరకుండా ఇంటి వద్ద నుండి వచ్చు విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కలదు.
- ఎంసెట్‌లో ర్యాంకు వచ్చిన విద్యార్థులకు (ఫీజు రీఎంబర్స్‌మెంట్ అర్హత ఉన్న విద్యార్థులు) ఏవిధమైన ఫీజులు లేవు. నేరుగా వచ్చి కాలేజిలో చేరవచ్చును.
- హాస్టలో ఉండు విద్యార్థులకు సంవత్సరానికి 25000/- రూపాయలు మాత్రమే
- మొదటి సం॥ విద్యార్థులకు, బస్సు తిరుగు రూట్లలో ఎక్కడనుండైనా సం॥ రూ.6000/-లు మాత్రమే.
- మేనేజ్‌మెంట్ విద్యార్థులు నేరుగా సంప్రదించి తగిన రాయితీలు పొందవచ్చును.


Dr.K.Subrahmanyam
M.Tech., P.hd
PRINCIPAL
Brahmiah College Of Engg.

PGECET CODE : BCEN 1
EAMCET/ECET/ICET/POLYCET CODE : BCEN





# ప్రజలను బాదొద్దు!

హడ్కో రుణం రూ.వెయ్యి కోట్ల భారాన్ని నెల్లూరు నగర ప్రజలపై వేయొద్దని, అలా వేస్తే సహించేది లేదని నెల్లూరురూరల్, నగర శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌లు కోరారు. ఆదివారం నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన హడ్కో నగరపాలక సంస్థల ఒప్పందాల అనంతరం డిప్యూటి మేయర్ ఛాంబర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ నగరాభివృద్ధికి రూ.వెయ్యికోట్లు నిధులను హడ్కో ద్వారా మంజూరు చేయించినందుకు కేంద్ర రాష్ట్ర మంత్రులు యం.వెంకయ్యనాయుడు, పి.నారాయణలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ వెయ్యికోట్ల రూపాయల భారాన్ని పన్నుల రూపంలో నగర ప్రజలపై వేస్తే సహించేది లేదన్నారు. హడ్కో రుణాన్ని గ్రాంటుగా మార్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైయస్సార్సీపీ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## అనాధలను ఆదరించడం అందరి బాధ్యత

అనాధలను ఆదరించడం అందరి బాధ్యతని కన్‌స్ట్రక్షన్స్ అధినేతలు దివి వెంకటేశ్వర్లునాయుడు, బొమ్మన హజరత్తయ్య అన్నారు. గత నెల 31వ తేదీ ఆదివారం వాత్సల్య నిరాధార బాలబాలికల కేంద్రంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా బడుగు, బలహీనవర్గాలను, పేదలను ఆదరించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. గత 27సంవత్సరాలుగా వాత్సల్య నిరాధార బాలబాలికల కేంద్రం ఎందరో అనాథలకు వసతి, విద్య కల్పించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాదరక్షలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో వాత్సల్య గౌరవాధ్యక్షులు సామంతు గోపాలరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.వి.సాంబశివరావు, ఏపియుడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.జయప్రకాష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్‌జేడీగా పరంధామయ్య

నెల్లూరు ఆర్‌ఐఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వై.పరంధామయ్యకు ఆర్‌జేడీ(ప్రాంతీయ సంయుక్త సంచాలకులు)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం, ఆర్‌జేడీగా, డివిఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డి.రామకృష్ణ పరమహంసను ఆర్‌జేడీ బాధ్యతల నుండి తప్పించి డిఓఈఓ బాధ్యతలకు పరిమితం చేశారు. ఆర్‌జేడీగా బాధ్యతలు స్వీకరించిన పరంధామయ్యను వివిధ సంఘాల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డివిఇఓ బాబుజాకబ్, ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సైమన్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.


## బ్రాహ్మణ సదస్సు 9న

ఈ నెల 9వ తేదీ సాయంత్రం 6 గంటలకు నగరంలోని పురమందిరంలో జిల్లా బ్రాహ్మణ సదస్సు నిర్వహించి, బ్రాహ్మణ సంఘీయులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలపై చర్చించి, సంఘీయుల అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలను నిర్ణయిస్తామని ఆ సదస్సు కన్వీనర్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. గత నెల 30న నెల్లూరు నగరంలోని టివిఎస్ కల్యాణసదన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ సదస్సుకు రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్ చంగవల్లి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. సదస్సుకు సంబంధించి సూచనలు, సలహాలను సంఘం సభ్యుడైన ఎనమంద్ర నాగదేవిప్రసాద్‌కు తెలియజేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో రాళ్ళపల్లి రామసుబ్బారావు, ఫణిరత్నం, వరప్రసాద్, మాచవోలు భాస్కరశర్మ, శివనారాయణ, రమేష్‌శర్మ, కిషోర్‌లు పాల్గొన్నారు.

## డా॥ విజయకుమార్ సంతాపసభ

నెల్లూరు పొదలకూరురోడ్డులోని జెడ్‌పి హైస్కూలు ఆవరణలో గత నెల 30వ తేదీన జడ్పీ వాకర్స్ సంఘం అధ్యక్షులు చెలంచర్ల భాస్కరరెడ్డి అధ్యక్షతన డా॥ విజయకుమార్ సంతాపసభ నిర్వహించారు. స్వర్గీయ డా॥ విజయకుమార్ ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వైద్యుడిగా, జనవిజ్ఞాన వేదిక నాయకుడిగా తమ సంఘం గౌరవసలహాదారుగా చేసిన సేవాపరంపరలను, ఆయన వ్యక్తిత్వం గురించి అధ్యక్షులు చెలంచర్ల భాస్కరరెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరావు, బిరదవోలు రామిరెడ్డి తదితరులు కొనియాడారు.

# నెల్లూరు కబుర్లు



## నెల్లూరుకు చంద్రబాబు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 5వ తేదీన జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఆరోజు ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగంలో నిర్వహించే జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. పింఛన్‌లు, దీపం కనెక్షన్‌ల పంపిణీతో పాటు మహిళా సంఘాల ఋణమాఫీకి అవసరమైన పత్రాలను మహిళలకు ఆయన చేతుల మీదుగా అందించనున్నారు.

## తాజ్‌లో తమ్ముళ్ల తగవు

ఇటీవల హైదరాబాద్‌లో తెలుగుదేశంపార్టీ మహానాడు ధూంధాంగా జరగడం తెలిసిందే. మహానాడుకు వెళ్లిన జిల్లా తెలుగుదేశం నాయకులందరికీ 'తాజ్' హోటల్‌లో బస ఏర్పాటు చేసారు. మహానాడు చూసుకుని సాయంత్రం హోటల్‌కు చేరుకున్నాక సరదాగా ఉండసాగారు. ఈ సమయంలో పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, గూటూరు కన్నబాబుల మధ్య స్వల్ప వివాదం రాజుకుంది. మాటా మాటా పెరిగింది. ఒకర్నొకరు తోసుకుంటున్న సందర్భంలో మా తమ్ముడిని తోస్తావా అంటూ కన్నబాబుకు మద్దతుగా కురుగొండ్ల రామకృష్ణ వచ్చాడు. ఈ తోపులాటలో రామకృష్ణ కూడా కింద పడిపోయాడు. దీంతో కన్నబాబు ఆవేశంతో... మనవాళ్ల మీద వాళ్లు దాడి చేస్తుంటే మీరు పట్టించుకోరా అంటూ బొల్లినేని రామారావు వద్దకెళ్లి కులం చిచ్చు రేపే ప్రయత్నం చేశారు. కాని బొల్లినేని మాత్రం హుందాగా ఇక్కడ కులాల ప్రస్తావన తేవద్దంటూ మందలించారు. ఈ నెల్లూరు తమ్ముళ్ళ వివాదం అక్కడున్నవారికి వినోదంలా మారింది!

## ముసవ్వీర్‌కు డాక్టరేట్




నెల్లూరు నగరం జెండా వీధికి చెందిన సూక్ష్మ స్వర్ణకళాకారుడు షేక్ ముసవ్వీర్ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. కళకు గుర్తింపుగా యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, కాలిఫోర్నియా, బర్కిలీ వర్శిటీ పరిధిలోని యునైటెడ్ థియోలజికల్ రీసెర్స్ యూనివర్శిటీ ఎక్స్‌టర్నల్ స్టడీస్ అండ్ రీసర్చ్ గౌరవడాక్టరేట్‌ను ముసవ్వీర్‌కు ప్రదానం చేసింది. హైదరాబాద్‌లోని టవర్‌క్లాక్ చర్చి ప్రాంగణంలో గత నెల 28వతేదీ జరిగిన కార్యక్రమంలో ఈ డాక్టరేట్‌ను అందుకున్నారు. వర్శిటీ వైస్‌ఛాన్సలర్ రైట్ రెవరెండ్ డాక్టర్ ప్రెడ్రిక్ ఫ్రాంచెస్, కాలిఫోర్నియా యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ మైక్, రిజిస్ట్రార్ ప్రీస్టన్ ఫిలిప్స్ తదితరులు గౌరవడాక్టరేట్‌ను ప్రదానం చేసారు.

## హైటెక్ బిల్డర్స్‌కు ఐఎస్‌ఓ సర్టిఫికెట్



నెల్లూరు ఇంజనీరింగ్ రంగంలో 2001 నుండి భవన నిర్మాణంలో సుదీర్ఘ సేవలందిస్తున్న నెల్లూరు మూలాపేట శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్దనున్న హైటెక్ బిల్డర్స్‌కు ఐఎస్‌ఓ 9001:2008 సర్టిఫికేట్‌ను భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థ బివి క్వాలిటి సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్, చెన్నై వారు మంజూరు చేశారు. హైటెక్ బిల్డర్స్‌కు ఐయస్‌ఓ సర్టిఫికెట్ మంజూరు చేయడం పట్ల సంస్థ అధినేత యండి సయ్యద్ నజీర్‌బాషా హర్షం వ్యక్తం చేశారు.

## జయభారత్‌కు అల్ట్రాసౌండ్ మిషన్

నెల్లూరులోని జయభారత్ హాస్పిటల్‌కు కందుకూరి ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత కందుకూరి సత్యనారాయణ అల్ట్రాసౌండ్ మిషన్‌ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఈ ఆసుపత్రి ద్వారా అనేక సేవలు అందుతున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని రూ.8లక్షల విలువైన మిషన్‌ను అందజేసినట్లు తెలిపారు. జయభారత్ ఆసుపత్రి ప్రధానకార్యదర్శి హరికుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బాలు సుబ్బారావు, ట్రస్టీలు జయరామిరెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, గుర్రం సుధాకర్, డాక్టర్లు కోటేశ్వరరావు, సాయికుమార్, సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం



జిమ్ వంశీ ఆధ్వర్యంలో ఆయన మిత్రులు స్వచ్ఛంధంగా రెడ్‌క్రాస్ రక్తనిధిలో సోమవారం రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాతపాటి విజయమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. జిమ్ వంశీ యూత్ ఫ్రెండ్స్ టి.రమేష్, ఫరీద్, హేమంత్, వంశీ, సమంత్, రెడ్‌క్రాస్ రక్తనిధి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా॥ డి.పెంచల సుబ్బయ్య, మెడికల్ ఆఫీసర్ డా॥ యస్.సాయినాథ్, మోటివేటర్ యం.మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఆర్‌ఎంగా మహేశ్వర్

నెల్లూరు ఆర్టీసీ నూతన రీజినల్ మేనేజర్‌గా జి.మహేశ్వర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, ప్రయాణీకులకు మెరుగైన సేవలందిస్తానన్నారు. ప్రయాణీకుల కోసం ప్రవేశపెట్టే కొత్త కార్యక్రమాలను ప్రణాళికతో అమలు చేస్తానన్నారు. నెల్లూరు జిల్లాలో గతంలో గూడూరు డిపో మేనేజర్‌గా, డిప్యూటి చీఫ్ మెకానికల్ ఇంజనీర్‌గా పని చేసానని, తిరుపతి, ప్రకాశం, విశాఖపట్నంలలో రీజినల్ మేనేజర్‌గా పనిచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఏఆర్‌కు ఏఎస్పీ

జిల్లా ఏఆర్ ఏఎస్పీగా కె.సూరిబాబు ఈ నెల 1వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ ఓఎస్‌డిగా పనిచేస్తున్న ఆయనను ఇక్కడకు బదిలీ చేశారు. హరిబాబు నెల్లూరుకు పాతోడే! గతంలో నెల్లూరు అడ్మిన్ ఆర్‌ఐగా, హోంగార్డ్ డిఎస్పీగా పనిచేశాడు. 2014 మేలో ఏఆర్ ఏఎస్పీగా వున్న ఏసి నాగేశ్వరరావు పదవీ విరమణ చేసాక ఇంత వరకు ఆ పోస్టులో ఎవరినీ వేయలేదు. ఎట్టకేలకు దానిని భర్తీ చేశారు.


## నెల్లూరులో జైళ్లశాఖ శిక్షణ కేంద్రం

ఏపికి సంబంధించిన జైళ్లశాఖ శిక్షణ కేంద్రాన్ని నెల్లూరులో ఏర్పాటు చేయనున్నారు. ఇంతకు ముందు ఈ కేంద్రం హైదరాబాద్‌లో ఉండేది. రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్‌లో వున్న ఈ కేంద్రం తెలంగాణ లెక్కలోకి పోయింది. అందుకే ఏపికి ప్రత్యేకంగా నెల్లూరులో జైళ్లశాఖ శిక్షణ కేంద్రాన్ని పెట్టనున్నారు.

## భూమి చల్లబడింది

రెండు మూడు నెలలుగా భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు విల విల్లాడారు. జూన్ 1వతేదీ నుంచి కొంత శాంతించడంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఉష్ణోగ్రత 38.2డిగ్రీలకు చేరింది. గతంలో 42డిగ్రీల నుంచి 45డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా సోమవారం నాలుగైదు డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## నేత్రదానం



నెల్లూరుజిల్లా కోవూరు మండలం పాటూరు గ్రామానికి చెందిన చిట్టమూరి శ్రీనివాసులురెడ్డి(75) ఆదివారం పరమపదించారు. ఆయన కుటుంబసభ్యుల కోరికమేరకు లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకిని ఆధ్వర్యంలో శ్రీనివాసులురెడ్డి నేత్రాలను డా॥ పిఎల్ రావు ఐ బ్యాంక్ టెక్నీషియన్ ఎండిబి ప్రసాద్ సేకరించారు. ఈ కార్యక్రమంలో నేత్రదాన మోటివేటర్ బయ్యా ప్రసాద్, నేత్రదాత కుటుంబ సభ్యులు మధు, జ్యోతి, లయన్స్ అధ్యక్షుడు శరత్‌బాబు, కార్యదర్శి సునీల్ తదితరులు పాల్గొన్నారు.



## వైకల్యాన్ని ఓడిద్దాం!

వివిధ రంగాల్లో సేవాకార్యక్రమాలను నిరంతరయజ్ఞంలా నిర్వహిస్తున్న వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఈ నెల 1వ తేదీన వికలాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ, శిక్షణా కార్యక్రమం జరిగింది. ట్రస్ట్, అలిమ్‌కో సంస్థలు సంయుక్తంగా ఈ మంచి పనిని చేపట్టాయి. కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆత్మవిశ్వాసంతో అంగవైకల్యాన్ని ఓడిద్దామంటూ వికలాంగులలో ఆత్మవిశ్వాసం నింపారు. దేశ జనాభాలో 3శాతం మంది వికలాంగులు ఉన్నట్లు తేలిందని, నరేంద్ర మోడీ ప్రధాని అయ్యాక 2.5లక్షల మంది వికలాంగులకు సాయం చేసినట్లు పేర్కొన్నారు. వికలాంగులకు 15కోట్లతో నెల్లూరులో స్వయం ఉపాధి శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెంకయ్య వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో మరో కేంద్రమంత్రి ధావర్‌చంద్ గెహ్లోట్, రాష్ట్రమంత్రి పి.నారాయణ, తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.జానకి, జాయింట్ కలెక్టర్ యం.డి.ఇంతియాజ్‌లు పాల్గొన్నారు. స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ ఐ.దీపావెంకట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

# చేతగాని మంత్రి వల్లే చిక్కులు



మంత్రిగా పనిచేయడం, మంత్రిగా వ్యవహరించడం, మంత్రిగా ప్రజల సమస్యలు తీర్చడం నారాయణ చేతకావడం లేదని, చేతకాని మంత్రి ఉండడం వల్లే జిల్లా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. ఈనెల 1వతేదీన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారాయణ నిర్వాకం వల్ల జిల్లాకు మంజూరైన నిధులు వెనక్కి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజీవ్ ఆవాస్ యోజన పథకం క్రింద కేంద్ర ప్రభుత్వం తొలివిడతగా రూరల్‌లోని పడారుపల్లికి 16కోట్లు, సూళ్లూరుపేట నియోజకవర్గానికి 26కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ మంజూరు చేయాలి. అయితే సింగపూర్ రాజధాని మైకంలో వున్న నారాయణ దీని గురించి పట్టించుకోకపోవడంతో కేంద్రం మంజూరు చేసిన నిధులు వెనక్కిపోయాయని, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడన్నా కలుగజేసుకుని ఈ నిధులను తిరిగి తెప్పించాలన్నారు. చంద్రబాబుకు నారాయణ మీద అంత అభిమానముంటే ఆయనను రాజధాని మంత్రిని చేసి, జిల్లాకు పనిచేసే మంత్రిని ఇవ్వాలని కోరారు.

## వివేకాను పచ్చిబూతులు తిట్టిన కళ్యాణ్



పీసీసీ ఉపాధ్యక్షులు, మాజీఎమ్మెల్యే ఆనం వివేకానంద రెడ్డిని సినీ నిర్మాత చిల్లర కళ్యాణ్ పచ్చిబూతులు తిట్టాడు. నెల్లూరు రామ్‌నగర్‌లోని ఓ స్థలంపై వివాదం జరుగుతోంది. దీనిని 2008లో చిల్లర కళ్యాణ్ కొని ఉన్నారు. దీనిలో ఇటీవలే అపార్ట్‌మెంట్ కడుతుండగా, ఈ స్థలం వక్ఫ్‌బోర్డుదని, ఇక్కడ నిర్మాణాన్ని ఆపేయాలంటూ వివేకా ఆందోళనకు దిగాడు. దీనిపై స్పందించిన కళ్యాణ్ ఇటీవల నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం పెట్టాడు. తన నోట్లో మట్టి కొట్టడానికి ప్రయత్నిస్తున్న వివేకాపై సి.కళ్యాణ్‌కు అరికాల్లో మండింది. దీంతో నోటికొచ్చినట్లు వివేకాపై దుమ్మెత్తి పోసాడు. వివేకాకు పిచ్చి ముదిరిందని, మదపిచ్చి పట్టిందని, ఇంకా పత్రికల్లో రాయలేని భాషలో తిట్టాడు. ఇన్నేళ్ల చరిత్రలో రాజకీయ ప్రత్యర్థులు కూడా వివేకాను ఈ స్థాయిలో తిట్టలేదు.

# కట్టుకున్న భార్య, కన్నబిడ్డే కడతేర్చారు

- సంచలనాత్మకంగా డా॥ విజయకుమార్ హత్య
- స్నేహితుల అనుమానంతో అడ్డం తిరిగిన కథ



డాక్టర్ సద్దా విజయకుమార్‌రెడ్డి... కమ్యూనిష్టు భావాలను పుణికి పుచ్చుకున్నాడు. విద్యార్థి దశలోనే ఉద్యమాలవైపు నడిచాడు. సారా వ్యతిరేకోద్యమంలో ఒక మెరుపులా మెరిసాడు. జనవిజ్ఞానవేదిక ద్వారా ప్రజలను అజ్ఞానంలో నుండి విజ్ఞానం వైపు నడిపించే ప్రయత్నం చేసాడు. పేదల వైద్యుడిగా ప్రసిద్ధిగాంచాడు. ప్రజల వైద్యుడిగా పేరు తెచ్చుకున్న డాక్టర్ విజయకుమార్ చివరకు తన బిడ్డ, భార్య చేతిలో దారుణహత్యకు గురికావడం జిల్లాలోనే పెనుసంచలనంగా మారింది.

నెల్లూరు హాస్పిటల్స్ అధినేత డాక్టర్ విజయకుమార్‌ది కిరాతక హత్యేనని తేలిపోయింది. అతని భార్య డాక్టర్ ఉషారాణి, కొడుకు సుందర్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తులు కలిసి ఈ దారుణానికి ఒడిగట్టారు.

వివరాలలోకి వెళితే... రామచంద్రారెడ్డి ఆసుపత్రిలో పనిచేసేటప్పుడు డాక్టర్ విజయకుమార్, డాక్టర్ ఉషారాణి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి కొడుకు, కూతురు పుట్టారు. కొడుక్కి పుచ్చలపల్లి సుందరయ్య పేరు కలిసేలా సుందర్ అని, కూతురుకు మార్క్సిస్టు యోధుడు లెనిన్ పేరు కలిసేలా లెనీనా అని పేర్లు పెట్టారు. కాలక్రమంలో విజయకుమార్, ఉషారాణిల కాపురంలో కలతలొచ్చాయి. విడాకుల కోసం కోర్టుకెళ్లారు. త్వరలో హైకోర్టు నుండి విడాకులు కూడా వచ్చే అవకాశముంది. కాగా విజయకుమార్ మరో మహిళతో సహజీవనం చేస్తున్నారు. ఈమధ్య నెల్లూరులోనే విజయకుమార్ కొత్త ఆసుపత్రి భవనం కట్టిస్తున్నారు. ఆ ఆస్థిని ఎక్కడ ఆ మహిళకు రాసిస్తాడోనని తల్లీ, కొడుకులు అనుమానపడ్డారు. గతంలోనూ విజయకుమార్‌తో సుందర్ ఆస్థి విషయమై గొడవ పడినట్లు తెలుస్తోంది. ఈ ఆస్థి తమకు దక్కకుండా పోతుందన్న భయంతో విజయకుమార్‌ను హత్య చేయడానికి వీళ్లు నిర్ణయించుకున్నారు. ఇందుకోసం హైదరాబాద్‌లో ఉంటున్న శ్రీధర్ సహకారంతో నేరస్థుడు గంగరాజుకు 3లక్షల సుఫారీ ఇచ్చి విజయకుమార్‌ను హత్య చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. చేతికి మట్టి అంటకుండా హత్య ముగించేలా ప్లాన్ చేసుకున్నారు.

తండ్రికి ఎప్పుడూ దూరంగా వుండే సుందర్ హత్యకు మూడురోజుల ముందు నుండి పోస్టల్‌కాలనీలో ఉంటున్న విజయకుమార్ ఇంటికి రాసాగాడు. సుందర్‌ను ఇంటికి రానీయొద్దని విజయకుమార్ తల్లి హెచ్చరించింది. అయితే పేగుబంధం కాబట్టి విజయకుమార్ రావద్దని చెప్పలేకపోయాడు. ప్రతిరోజూ ఇంటికి చేరాక రాత్రి కుక్కలను వదిలి పెట్టడం విజయకుమార్‌కు అలవాటు. సుందర్ ముందుగా వాటిపై దృష్టిపెట్టాడు. ఈ మూడురోజుల్లో వాటికి బిస్కెట్లు వేస్తూ మచ్చిక చేసుకున్నాడు. హాస్పిటల్ నుండి వెళ్లేటప్పుడు ఓ మత్తుమాత్ర వేసుకోవడం విజయకుమార్‌కు అలవాటు. ఆయన హత్య జరిగిన రోజు మే 27వ తేదీ కూడా ఆయన మత్తు మాత్ర వేసుకుని వెళ్లాడు. ఆపైన మద్యం కూడా సేవించి, భోజనం చేసి నిద్రపోయాడు. విజయకుమార్ తల్లి కూడా అంతకుముందే నిద్రపోయింది. ఇదే అదునుగా భావించిన సుందర్ తన తల్లికి, సుఫారీ తీసుకున్న గంగరాజుకు సమాచారమందించాడు. వెంటనే వాళ్లు విజయకుమార్ ఇంటికి చేరుకున్నారు. ఇంటిలోపలే వున్న సుందర్ తలుపులు తీసాడు. ఉషారాణి, గంగరాజులు లోపలకు వెళ్లారు. విజయకుమార్ నిద్రలో వుండగా భార్య రెండు కాళ్లు పట్టుకుంది. సుందర్ రెండు చేతులు గట్టిగా పట్టేసాడు. గంగరాజు విజయకుమార్ గుండెలపై కూర్చుని గొంతు నులిమి ఊపిరాడకుండా చేసి చంపారు.

### హైడ్రామా...

విజయకుమార్‌కు గుండెపోటు వచ్చిందంటూ సుందర్ తన తండ్రి దేహాన్ని బొల్లినేని హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. అక్కడి వైద్యులు పరీక్షించి అతను మృతిచెందాడని చెప్పారు. ఆ తర్వాత అతని మృతదేహాన్ని బాలాజీనగర్, వాసవినగర్‌లోని ఉషారాణి ఇంటి వద్దకు తెచ్చారు. మమ్మల్ని వదిలి వెళ్లావా అంటూ భార్య ఉషారాణి, కొడుకు సుందర్‌లు ఎక్కిళ్లుపెట్టి ఏడ్చారు. పరామర్శించడానికి వచ్చిన వాళ్లు కూడా వాళ్ల ఏడుపు చూసి కరిగిపోయారు. విజయకుమార్ గుండెపోటుతో మరణించాడని దాదాపు అందరినీ నమ్మించారు.

### స్నేహితులే వెలుగులోకి తెచ్చారు...

అందరూ విజయకుమార్ గుండెపోటుతోనే మృతి చెందాడని నమ్మినా, అతని సన్నిహితులు నమ్మలేదు. విజయకుమార్ ముక్కుల్లో నుండి రక్తం కారి గడ్డ కట్టి ఉండడాన్ని వీరు గమనించి, ఇది హత్యేనని భావించారు. విజయకుమార్‌ది సహజమరణం కాదని, పోస్టుమార్టం నిర్వహించి నిజాలను నిగ్గుతేల్చాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మృతదేహం వద్దకు వెళ్లారు. పోస్టుమార్టంకు తీసుకెళ్లే ప్రయత్నం చేయగా ఉషారాణి, సుందర్‌లు అడ్డుపడ్డారు. విజయకుమార్‌ది సహజమరణమేనని, మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి అప్పగిస్తున్నామని బలంగా వాదించారు. కొందరు సిపిఎం నాయకులు వారి వాదనకు మద్దతు పలికినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు వెనుదిరిగారు. అయినా ఈ మృతిపై అనుమానం వ్యక్తం చేసిన విజయకుమార్ మిత్రులు వెనక్కి తగ్గలేదు. డాక్టర్ మిత్ర ద్వారా పైస్థాయిలో పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. జిల్లా పోలీసులలో కదలిక తెచ్చారు. మే29వ తేదీ విజయకుమార్ మృతదేహాన్ని తరలిస్తుండగా పోలీసులు అడ్డుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. పోస్టుమార్టంలో విజయకుమార్‌ది హత్యేనని తేలింది. దీంతో పోలీసులు సుందర్‌ను అదుపులోకి తీసుకుని తమ శైలిలో విచారించగా అసలు కథంతా బయటపడింది.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# గూడూరు డివిజన్ వార్తలు

## భవన నిర్మాణ కార్మికులపై నిర్లక్ష్యం



సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో గీతావాణికి ఫిర్యాదు చేస్తున్న కార్మిక సంఘ నాయకులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆ సంఘ గౌరవాధ్యక్షుడు వి.వి. రమణయ్య, గౌరవసలహాదారు పుట్టా శంకరయ్య పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సోమవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారికి సమస్యల వినతిపత్రం అందించి మాట్లాడారు. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత కార్మిక రంగం ఎంతో పెద్దదని, దేశవ్యాప్తంగా 6కోట్ల మంది పనిచేస్తుంటే ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. సంక్షేమం కోసం బడ్జెట్లో కేటాయించిన నిధులు వారికే ఖర్చు చేయాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. 60ఏళ్లు దాటిన కార్మికులకు పింఛన్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, రఫి, క్రిష్ణయ్య, సుధాకర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిబిఎస్ఇలో లిటిల్ ఏంజల్స్ సంచలనం




గూడూరు మండలం చిల్లకూరు, శారదానగర్‌లోని లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూలు 2015 సిబిఎస్ఇ 10వ తరగతి ఫలితాల్లో మరోసారి తన విజయపరంపర కొనసాగించింది. 8మంది విద్యార్థులు 10కి 10పాయింట్లు సాధించారు. 29 మంది విద్యార్థులకు 9పాయింట్లపైన రావడం ఈ పాఠశాల సత్తా తెలియజేస్తుంది. ఎం.శిరీష, పి.సునయన, ఎం.కౌశ్యప్ ప్రణమ్‌కుమార్, వి.ఆషిష్, పి.రాకేష్‌రోషన్, ఎం.సాయికౌశిక్, ఐ.శ్రీహరి, ఎస్.వి.ఎల్. సాయికుశల్‌కుమార్‌లు 10కి 10 పాయింట్లు సాధించారు.

ఈ ఘనవిజయం పట్ల పాఠశాల కరస్పాండెంట్లు బి.సుబ్రహ్మణ్యం, బి.శ్రీకాంత్ రెడ్డిలు మాట్లాడుతూ గత 30సంవత్సరాలుగా సిబిఎస్ఇ సిలబస్‌తో ప్రైవేటు యాజమాన్యంతో నెల్లూరుజిల్లాలో నడపబడుతున్న ఏకైక పాఠశాల మా లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్ అని, 100% ప్రథమశ్రేణి రిజల్ట్స్‌తో అందరూ ఉత్తీర్ణులు కావడం విద్యార్థుల పట్ల తమకున్న అంకిత భావాన్ని తెలియజేస్తుందన్నారు. నైతిక విలువలతో కూడిన ఆదర్శవంతమైన విద్య అందించడంలో తమ స్కూలు ఎప్పుడూ ముందుంటుందని, ఈ విజయానికి కారకులైన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లి దండ్రులకు అభినందనలు తెలిపారు.

## అర్జీలు ఎన్ని పరిష్కరించారో చెప్పాలి



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు నియోజకవర్గంలో గతంలో జరిగిన జన్మభూమి–మా ఊరు కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన వినతులను నేటికీ పరిష్కరించలేదని, మళ్ళీ ఇప్పుడు అదే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరులోని రోడ్లు భవనాల అతిథిగృహంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో నియోజకవర్గ ప్రజలిచ్చిన అర్జీలు ఎన్ని పరిష్కరించారో అధికారులు చెప్పాలన్నారు. వీటిపై ఉన్నతాధికారులు తప్పుడు నివేదికలు ఇస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, రుణమాఫి నేటికీ పూర్తిగా అమలు కాలేదని, దాంతో రైతులు, డ్వాక్రా మహిళలు అర్థంకాని పరిస్థితిలో ఉన్నారన్నారు. నియోజకవర్గంలో అధికారుల బదిలీల విషయంలో రాజ్యాంగేతర శక్తులు పనిచేస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో వైకాపా నాయకులు నాశిన నాగులు, మెట్టు రాధాకృష్ణారెడ్డి, వాటంబేటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మాతమ్మల సమస్యలు పరిష్కరించాలి



దీక్షా శిబిరంలో మాతమ్మలు

మాతమ్మల సమస్యలు పరిష్కరించాలని సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ సమీపంలో మాతమ్మ విముక్తి సేవాసంఘం ఆధ్వర్యంలో దీక్షలు చేశారు. మాతమ్మలకు 1.5లక్షలు ఫిక్సిడ్ డిపాజిట్ వేస్తామని గతంలో అధికారులు చెప్పినమాట అమలు చేయలేదన్నారు. ఒకటిన్నర ఎకరా ఇస్తామని చెప్పి ఎకరా మాత్రమే ఇచ్చారని, మిగతాది ఎటుపోయిందని ప్రశ్నించారు. రుణాలు వెంటనే మంజూరు చేయాలని, కేటాయించిన గృహాలను వెంటనే చూపించాలని డిమాండ్ చేశారు. తమను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఆమేరకు అధికారులకు వినతిపత్రమిచ్చారు. ఈ కార్యక్రమంలో మాతమ్మలు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు



గురువులతో పూర్వ విద్యార్థులు

గూడూరు మండలం చెన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1992–93లో పదవ తరగతి చదివిన పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి బాల్యం నుంచి క్రమశిక్షణ, పట్టుదలతో అనుకున్న లక్ష్యం దిశగా ముందుకు వెళితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరవచ్చని, దీన్ని మీ పిల్లలందరికీ నేర్పాలన్నారు. పలు ప్రాంతాల్లో వివిధ రంగాల్లో స్థిరపడిన వారందరూ ఉదయాన్నే ఇక్కడకు చేరుకొని తాము చదువుకున్న గదులు, పరిసర ప్రాంతాల్లో కలియదిరిగారు. అప్పటి ఉపాధ్యాయులు, విద్యాబోధన, అల్లరి చేష్టలను గుర్తు చేసుకుని ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాలలో వసతుల కల్పన, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందించి విద్యాభివృద్ధికి కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులు గంగిశెట్టి శివకుమార్, అల్లి గోవర్ధన్, పైడి కృష్ణయ్య, శ్రీనివాసులు, చెంచురామయ్య, బాలగురునాథం, చెంచు క్రిష్ణయ్యలను ఘనంగా సన్మానించారు.

## దేవాలయాల అభివృద్ధికి నిధులివ్వండి

గూడూరు మండలంలోని పలు గ్రామాల్లోని దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మెన్ చదలవాడ క్రిష్ణమూర్తిని సోమవారం నాడు కలసి కోరామని గూడూరు మండల మాజీ ఉపాధ్యక్షుడు నెలబల్లి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరులో సుదర్శన కౌంటర్ ఏర్పాటుకు ఛైర్మెన్ హామీ ఇచ్చారని చెప్పారు. ఆయన వెంట గ్రామ ఉపసర్పంచ్ రవీందర్‌రెడ్డి, రాజగోపాల్ తదితరులున్నారు.













## రాశి - మీ వాసి



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 05.06.2015 నుండి
తేది. 11.06.2015 వరకు

ఈ వారం ధనుర్మకర కుంభ మీనరాశులలో చంద్రుడు, మీనంలో కేతువు, వృషభంలో రవికుజ బుధులు, కర్కాటకంలో గురుశుక్రులు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 8 సోమవారము మృగశీర్ష కార్తె ప్రారంభము.

### ముహూర్తములు

- తేది 7 ఆదివారము ఉదయం గంట 8.27 నుండి గంట 10.37లోగా కర్కాటక లగ్నమున ఉపనయన, వివాహ, వ్యాపార, కేశ ఖండనము, అన్నప్రాశనములు.
- తేది 8 సోమవారము రాత్రి గంట 8.52 నుండి గంట 10.58లోగా మకర లగ్నమున గృహప్రవేశము.

### జ్యేష్ఠమాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 05 | శుక్ర | తదియ | రా॥గం.7.02వ॥ |
| తేది. 06 | శని | చతుర్థి | సా॥గం.5.24వ॥ |
| తేది. 07 | ఆది | పంచమి | సా॥గం.3.29వ॥ |
| తేది. 08 | సోమ | షష్ఠి | ప॥గం.1.18వ॥ |
| తేది. 09 | మంగళ | సప్తమి | ఉ॥గం.10.56వ॥ |
| తేది. 10 | బుధ | అష్టమి | ఉ॥గం.8.30వ॥ |
| తేది. 11 | గురు | నవమి | ఉ॥గం.6.01వ॥ |
| | పిదప | దశమి | రా॥గం.3.34వ॥ |

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

అగ్రిమెంట్లు, భాగస్వామ్య పెట్టుబడులకు అనుకూల సమయము. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరగడం, అభివృద్ధి ఉంటుంది. ప్రణాళిక బద్ధంగా పనులు జరుపుకొంటూ వస్తారు. ఆర్థిక సమస్యలు కుటుంబ సమస్యలు సర్దుబాటు కాగలవు. విద్యార్థులు ఉన్నత విద్యపై దృష్టి పెడతారు. బంధుమిత్రులతో సత్సంబంధాలుంటాయి. స్థిరాస్తుల వ్యవహారాలు నిర్ణయం కాగలవు.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉపాధి పథకాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. వస్త్రాభరణ, మందులు పచారి షాపుల వ్యాపారులకు ఆదాయము పెరుగుతుంది. వృత్తి జీవనం గలవారు తీరిక లేకుండా శ్రమించగలరు. శుభవార్తలు వినడం, అనుకున్న పనులు సాఫీగా జరగడం, బంధుమిత్రులను కలుసుకొనడం జరుగుతుంది. ఉద్యోగులకు పని తీవ్రత, అధికారుల వత్తిడి ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడతారు. వ్యాపార వర్గాలకు కొద్దిపాటి అవకాశాలు చేజారిపోవచ్చును. అనుకున్న పనులు నిదానంగా జరుగుతూ టెన్షన్ పెడుతాయి. కోర్టు కేసులు వాయిదా స్థితిలో వుంటాయి. సభలు సమావేశాలలో ప్రముఖంగా వ్యవహరిస్తారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. కొత్త ఉద్యోగావకాశాలు దొరికే అవకాశం, స్థిరాస్తులపై ఆదాయం ఉంటుంది.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వ్యాపారాలలో కొద్ది ఇబ్బందులుండినా ఆదాయానికి లోపం రాదు. వృత్తి నిర్వహణలో మంచిపేరు, రాబడి ఉంటుంది. సభలు సమావేశాలలో మీ మాటకు విలువ గుర్తింపు ఉంటుంది. ఈ వారం కూడా ఖర్చులు అధికంగానే ఉంటాయి. అవసరాలకు డబ్బు సర్దుబాటు అవుతుంది. విద్యార్థులకు మంచి ఫలితాలు, ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి అనుకూలత కలదు.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

అన్ని విధాలా జాగ్రత్త పడవలసిన సమయం. ఆశించిన అవకాశాలు వ్యాపారవర్గాలకు దొరకక పోవచ్చును. వృత్తి జీవనం కలవారికి సామాన్య ఆదాయం. అనుకున్న పనులు సరిగా జరగక వాయిదా వేసికొనవలసి వస్తుంది. అవసరాలకు ఋణాలు చేస్తారు. బాకీల చెల్లింపుల వత్తిడి పెరుగుతుంది. ఉద్యోగులు పై అధికారులతో, పబ్లిక్‌తో జాగ్రత్త పడండి.

### మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థిక ఇబ్బందులుండినా సామాన్య ఆదాయానికి లోపం రాదు. తొందరపడి కొత్తగా పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాల జోలికి పోవద్దు. వృత్తి వ్యాపారాలలో కొన్ని అవకాశాలు తప్పిపోగలవు. కొత్త విషయాలపై కుటుంబంలో చర్చ ఉండవచ్చును. అనుకున్న పనులు జరగడానికి బాగా శ్రమ పడాలి. రైతులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, వడ్డీ వ్యాపారులకు ఇబ్బందులుంటాయి.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థికంగా బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా అభివృద్ధికరంగా ఉంటాయి. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. అయితే కొద్దిపాటి టెన్షన్ ఉంటుంది. స్థలాలు, ఇండ్లు వంటివి క్రయవిక్రయాలు జరుగవచ్చును. బంధుమిత్రుల సహకారంతో శుభకార్యాలు నిర్ణయం కావచ్చును. రావలసిన బాకీలు, ఋణాల చెల్లింపులు జరుగుతాయి. ఆరోగ్యం బాగుంటుంది.


### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలు ఆదాయాన్ని పెంచగలవు. సొంత పని జరుగుటకు వచ్చిన అవకాశాన్ని చక్కగా వాడుకుంటారు. కొత్త వ్యాపారాలలో భాగస్వామ్యానికి, పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. చేపట్టిన పనులను సమర్థవంతంగా పూర్తి చేస్తారు. కృషికి తగ్గ ప్రయోజనం, గుర్తింపు పొందుతారు. అనవసర విషయాలలో చొరబడటం, హామీలివ్వడం చేయవద్దు.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వ్యాపారాలలో మెరుగైన పరిస్థితులుండి ఆదాయం బాగుంటుంది. వివాదాలు కోర్టు కేసులు రాజీకి రావచ్చును. ఆర్థికపరమైన ఉద్యోగ పరమగు ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. విలువైన వస్తు వాహన ఆభరణాలను సమకూర్చుకొంటారు. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. అధికారుల సహకారం బాగుంటుంది. శుభకార్యాలకు వెళ్లినందున ఖర్చులు అదనంగా ఉంటాయి. గృహమార్పులుండవచ్చును.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనుకున్న పనులు జరగడానికి చాలా గట్టి ప్రయత్నాలు చేయాలి. ఆదాయానికి తగిన ఖర్చులు పైనబడగలవు. కుటుంబసభ్యుల చదువులు, ఆరోగ్య విషయాలపై ఆందోళన ఉంటుంది. వ్యాపార అభివృద్ధి అవకాశాలు తాత్కాలికంగా తగ్గుతాయి. అనుకోని దూర ప్రయాణాలు, ప్రముఖులను కలుసుకొనడం జరుగుతుంది. ఉద్యోగులకు పనిబాధ్యతలు పెరుగుతాయి.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కొద్దిపాటి ఆర్థిక సమస్యలుండి సర్దుబాటు కాగలవు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగి ఆదాయాన్ని పెంచుతాయి. బంధువర్గంతో విభేదాలు రావచ్చును. అనుకున్న పనులకు కొద్ది ఆటంకాలు ఎదురుకాగలవు. కుటుంబంలో స్వల్ప అపార్థాలుండి ఇబ్బంది పడతారు. ఉద్యోగులు పొరపాట్లు చేయకుండా జాగ్రత్తపడి, అధికారులతో పబ్లిక్‌తో జాగ్రత్తగా మెలగండి.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

నూతన పెట్టుబడులకు, వ్యాపార ప్రారంభాలకు అనుకూలంగా ఉంటుంది. అనుకున్న పనులు సవ్యంగా జరగడం, కృషికి తగిన గుర్తింపుగౌరవాలు, కొత్త ఆర్థిక వనరులు సమకూర్చుకొనడం జరుగుతుంది. వ్యాపారాలలో వృత్తులందు ఆదాయం పెరుగుతుంది. ఆహ్వానాలు అందుకుంటారు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపవలసి ఉంటుంది. ఉద్యోగప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది.

# వివేకా హీరోగా సి.కళ్యాణ్ సినిమా!

శ్రీను గల్పిక

ఐఆర్20-420 నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమల ఉత్పత్తి కేంద్రంగా భాసిల్లుతున్న నెల్లూరు నగరమది. కలెక్టరేట్ ఎదురుగా వున్న మహబూబ్‌ఖాన్ పార్కులోని ప్రెస్‌క్లబ్‌లో సినీ నిర్మాత సి.కళ్యాణ్ ప్రెస్‌మీట్. రామ్‌నగర్‌లోని ఓ స్థలం వివాదంపై కళ్యాణ్ మాట్లాడుతూ... ఆనం వివేకానందరెడ్డి అనవసరంగా ఈ స్థలం విషయాన్ని పెద్దది చేస్తున్నాడు. ఇది పక్కాగా కొన్నాను. దీనికి సంబంధించిన డాక్యుమెంట్లు పక్కాగా వున్నాయి. వివేకా చిల్లర రాజకీయం చేస్తున్నాడు. ఆయన భాగోతమంతా నాకు తెలుసు. వివేకా... ఫ్లూట్ జింక ముందు ఊదు... సి.కళ్యాణ్ అనే ఈ సింహం ముందు కాదు, నీ వేషాలన్నింటిని పెట్టి త్వరలో ఓ సినిమా తీస్తా... నా జోలికొచ్చావో ఖబడ్దార్... అంటూ ముగించాడు.

★★★★★


కాపువీధిలోని స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(64+) ఆఫీసు. నగరంలో అడ్డమైన తిరుగుళ్లు తిరిగి వివేకా అప్పుడే ఏ.సి సెంటర్‌లోని తన ఆఫీసుకు చేరాడు. తన ఆఫీసులో చీకటిగా ఉండడంతో... రేయ్ ఫణి... చీకటిపడినా కూడా ఆఫీసులో లైట్లు వేయలేదేంరా అని అడిగాడు. వివేకా వంక ఫణి విచిత్రంగా చూసాడు. వెంటనే వివేకా కళ్లకున్న నల్లద్దాలు తీసి పెట్టాడు. అప్పుడు ఆ గదంతా వెలుగునిండి వుండడం కనిపించింది. పొరపాటు తనదేనని వివేకా గ్రహించాడు. అక్కడే కూర్చుని ఏసిటి ఛానెల్ పెట్టాడు. అప్పుడే జిల్లా వార్తలు వస్తున్నాయి. అందులో సి.కళ్యాణ్ ప్రెస్‌మీట్ రాసాగింది. తనను సి.కళ్యాణ్ తిడుతుండడాన్ని వివేకా నవ్వుతూ చూస్తూ... భలేవాడు తగిలాడు కదరా మనకు, నెల్లూరులో వున్న నాయకులు కూడా మనల్ని ఈ మాత్రం తిట్టలేదు అని అంటుండగా... వివేకా వేషాల మీద సినిమా తీస్తా అంటున్న సి.కళ్యాణ్ మాటలు వినిపించాయి. వివేకా ఒక్క నిముషం ఆ మాటలను ఆసక్తిగా విన్నాడు. సినిమా మాట రాగానే వివేకా ఆవేశంగా లేచి... రేయ్ లేయండ్రా, ఆ సి.కళ్యాణ్ ఎక్కడున్నాడో వెంటనే పట్టుకోవాల్రా... తొందరగా పోదాంపదండంటూ లేచాడు.

వివేకా ఆవేశాన్ని చూసి... బాస్‌కు బాగా కోపమొచ్చినట్లుంది, ఆ కళ్యాణ్ దొరికితే చావబాదేటట్లున్నాడు అనుకుంటూ వివేకా అనుచరులు పిండి సురేష్, చక్రవర్తి, బర్నాబాసు, ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డిలు కర్రలు తీసుకుని కారులో కూర్చున్నారు. సి.కళ్యాణ్ ఎక్కడున్నాడనేదానిపై వేట మొదలైంది. నగరంలో అన్ని హోటళ్లు గాలించారు. ఎక్కడా దొరకలేదు. చివరకు ఓ హోటల్‌లో అడిగితే ఇప్పుడే హైదరాబాద్‌కు వెళ్లడానికి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు బయల్దేరాడని చెప్పారు. వివేకా వెంటనే కారును రయ్‌మంటూ ముందుకు దూకించాడు. రోడ్డు మీద విమానంలా దూసుకుపోతున్నాడు. వివేకా స్పీడ్‌కు కారులో వున్న మిగతావాళ్లు ప్రాణాలు పిడికిట్లో పెట్టుకున్నారు. ముప్పావు గంటలో రేణిగుంటకు చేరుకున్నాడు. హైదరాబాద్ వెళ్లే ఫ్లైట్ అప్పుడే రన్‌వే మీద టేకాఫ్ కావడానికి ముందుకు కదిలింది. 'పోకిరి' సినిమా క్లైమాక్స్ ఫైట్‌లో కారు అద్దాలు పగలగొట్టుకుని బయకు దూకిన మహేష్‌బాబులా వివేకా కూడా కారులో నుండి రన్‌వే మీదకు జంప్ చేశాడు. విమానం వెనుకే పరుగెత్త సాగాడు. విమానం రెక్కయినా దొరికితే ఎక్కి సి.కళ్యాణ్‌ను పట్టుకోవాలనేది వివేకా ఆలోచన. విమానం గాల్లోకి లేచింది. వివేకా కూడా విమానం రెక్క పట్టుకోవడానికి గాల్లోకి లేచాడు. వెంట్రుకవాసిలో అది మిస్సయ్యి రన్‌వే మీద పడ్డాడు. అయినా ఎగిసిన కెరటంలా మళ్లీ లేచి... కారెక్కాడు. కారును రేణిగుంట కడప రోడ్డులోకి మళ్లించాడు. చక్రవర్తి భయపడుతూ... ఎందుకు సార్, ఇంత ఆవేశంగా బండి తోలుతున్నారని అడిగాడు. ఆ సి.కళ్యాణ్ ఇక్కడ తప్పించుకున్నాడురా... ఈ విమానం హైదరాబాద్ చేరేలోపు మనం కూడా అక్కడకెళ్లి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అతనిని పట్టుకోవాలన్నాడు. బాస్ ఇంత ఆవేశంగా వుండడం ఎప్పుడూ చూల్లేదు. కళ్యాణ్‌కు ఈరోజు మూడిందే అని కారులో వునోళ్లు అనుకోసాగారు.

పిండి సురేష్ అయితే నెల్లూరులో వున్న వివేకా ఇంకో పిఏ రాజుకు ఫోన్ చేసి... రాజు, నువ్వు వెంటనే లాయర్‌తో మాట్లాడు, మన బాస్‌కు బెయిల్ పేపర్స్ రెడీగా వుంచు... మన వాళ్లందర్నీ అలర్ట్‌గా ఉండమని చెప్పు. ఈరోజు బాస్ ఆవేశం చూస్తుంటే... నాకు ఎడమ, కుడి కళ్లు కంబైన్డ్‌గా అదురుతున్నాయి. ఇక్కడ ఈయన భీకరంగా ఫైట్ చేసేటట్లున్నాడు. అవతల వాళ్లు కేసు పెట్టడం ఖాయం. బీ కేర్‌ఫుల్ అంటూ ఫోన్ పెట్టేశాడు. అలా కారులో కడప, కర్నూలు హైవే మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. వీరికళ్ల ముందే సి.కళ్యాణ్ ఎయిర్‌పోర్టు నుండి బయటకొచ్చి, కారెక్కి ముందుకు కదిలాడు. వివేకా అతని కారును ఫాలో అయ్యాడు. సి.కళ్యాణ్ నేరుగా ఇంటి వద్దకుపోయాడు. కారు దిగాడు. వివేకా కూడా అతని వెనుకే కారుదిగాడు. వివేకాను చూడగానే బిత్తరపోయి... ఇతనేం మనిషిరా నాయనా, అలా తిట్టి వచ్చానో లేదో ఇలా దెయ్యంలా వచ్చి పట్టుకున్నాడని మనసులో అనుకుని నిలబడిపోయాడు. వివేకా కారు దిగగానే చక్రవర్తి, బర్నాబాసు, పిండి సురేష్, ఏ.సి. సుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డిలు యుద్ధానికి సిద్ధమన్నట్లు చొక్కాలు మడిచి రెడీ అయ్యారు. వివేకా నేరుగా వెళ్లి సి.కళ్యాణ్‌ను ఆత్మీయంగా వాటేసుకున్నాడు. ఆ పరిణామానికి కళ్యాణ్‌తో పాటు వివేకా వెంట వెళ్లిన వాళ్లు కూడా స్టన్ అయ్యారు. వివేకా వుండి... కళ్యాణ్ నీకిదేమన్నా పద్ధతిగా వుందా? నా వేషాలతో సినిమా తీస్తానన్నావ్... ఆ సినిమాలో హీరోగా నన్నే పెట్టొచ్చుకదా, రియాల్టీగా వుంటుంది. నాతో అందరూ సినిమాలు తీస్తామంటున్నారేగాని, ఒక్కరూ తీయడం లేదు. నాకేం రెమ్యూనరేషన్ వద్దు... కాని అనుష్కను హీరోయిన్‌గా పెట్టు. అలాగే కంగానారౌత్‌తో ఓ ఐటం సాంగ్, ఫారిన్ లొకేషన్స్‌లో పాటలు పెడితే చాలు. నాకు ఈ మేలు చేసి పుణ్యం కట్టుకో అని చెప్పాడు. సి.కళ్యాణ్ ఇలాంటి స్వాధుస్వభావినా నేను తిట్టొచ్చింది అని అనుకుంటూ... తదుపరి చిత్రం తప్పకుండా మీతోనే చేస్తానన్నా అని హామీ ఇచ్చాడు. దాంతో వివేకా ఆనందంగా కారెక్కి వెనుదిరిగాడు.

పిండి సురేష్ వుండి... అదేంటి బాస్, మీరేదో ఇరగదీస్తారు, పొడుస్తారనుకుని వస్తే, ఇలా సినిమా ఛాన్స్ అడిగొచ్చారని అన్నాడు. దానికి వివేకా... నాతో సినిమా తీయని... భారీగా బడ్జెట్ పెంచేలా చేస్తాను, విదేశాలలో సెట్టింగ్స్ వేయిస్తాను, మగధీర, బాహుబలిలను మించిపోయేలా గ్రాఫిక్ సీన్స్ పెట్టిస్తాను, ఓ ఆరు మంది హీరోయిన్‌లతో స్పెషల్ సాంగ్ పెట్టించుకుంటాను. ఈ సినిమాలో చెత్తగా నటించి సినిమాను అట్టర్‌ఫ్లాప్ అయ్యేలా చేస్తాను. ఆ దెబ్బతో కళ్యాణ్ నెత్తిన గుడ్డేసుకుంటాడు. ఆ విధంగా నా కసి తీర్చుకుంటానని చెప్పి వివేకా తిరిగి నెల్లూరుకు బయల్దేరాడు.

# కల్యాణ వైభవం...!



నెల్లూరు పెద్దబజారులోని శ్రీ సాయి ఎంటర్‌ప్రైజెస్ అధినేత నందిగం నరసింహారావు - విజయలక్ష్మిల కుమారుడు **వంశీకృష్ణ - సుజాత** (టేకుమళ్ళ ప్రతాప్ - సుభాషిణిల కుమార్తె)ల కల్యాణం మే 31వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.



ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ బుర్లా సుబ్బరామ్‌రెడ్డి - విజయలక్ష్మిల కుమారుడు **అరవింద్ - శ్రేయ** (సిద్ధవరం గ్రామ వాస్తవ్యులు దువ్వూరు గిరిధర్‌రెడ్డి - ప్రవంతిల కుమార్తె)ల వివాహం మే 29వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కల్యాణ మండపంలో జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాకాంక్షలు.



బీజేపీ నాయకులు కాకూరు నాగరాజారెడ్డి - హైమావతిల కుమారుడు **వృద్ధి - సుజిత** (ఒంగోలు వాస్తవ్యులు వెంకటశేషారెడ్డి - విజయలక్ష్మిల కుమార్తె)ల పెళ్ళి మే 31వ తేదీ నెల్లూరులోని ఏఎంఆర్ ఫంక్షన్ హాలు నందు జరిగింది. కొత్త దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.



నెల్లూరు వాస్తవ్యులు పసుపులేటి సుబ్బారావు - సులోచనల కుమార్తె **సువర్ణ వెంకటకృష్ణవేణి - సతీష్** (నెల్లూరు వాస్తవ్యులు భీమిశెట్టి సత్యనారాయణ - లీలావతమ్మల కుమారుడు)ల పరిణయం మే 28వ తేదీ నెల్లూరులోని గుడిగంట్ల బాలపీరయ్య కల్యాణ మండపంలో జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' ఆశీస్సులు.

# సమస్యలపై నోరు మెదపని ప్రజాప్రతినిధులు

## - మండల సమావేశానికి హాజరుకాని అధికారులు -





కావలి కబుర్లు

గ్రామాల్లోని ప్రజాసమస్యలపై మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు ఎవ్వరూ నోరు విప్పి మాట్లాడకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. సోమవారం స్థానిక మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో కావలి మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు పర్రి మహేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమస్యలపై చర్చ జరగకుండానే ముగిసింది. గతంలో జరిగిన సమావేశాల మాదిరిగానే నాలుగో సమావేశం కూడా నామమాత్రంగానే నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు మహేశ్వరి మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలున్నాయన్నారు. విధి నిర్వహణలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసమస్యలు పరిష్కరించకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. ఎంపిడిఓ జ్యోతి మాట్లాడుతూ జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు తప్పక పాల్గొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

**సమావేశానికి హాజరుకాని అధికారులు:** మండల సర్వసభ్య సమావేశానికి మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు పాల్గొని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ఆయా శాఖల పనితీరుపై సమగ్ర నివేదిక ఇవ్వవలసి ఉండగా ఈ సమావేశానికి అంగన్‌వాడీ, ఉద్యానవనం, పోలీసుశాఖ, నీటి పారుదల, పంచాయితీ రాజ్, మత్స్య, అటవీశాఖ అధికారులు హాజరు కాలేదు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు వి.శ్రీనుబాబు, కో-ఆప్షన్ సభ్యులు ఖలీల్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు ఎన్.శ్రీనివాసులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

### కేబుల్ తవ్వకాలతో...

# మాయమౌతున్న సిమెంటురోడ్లు

## రిలయన్స్‌కు దాసోహం అంటున్న మున్సిపల్ అధికారులు



కావలి పట్టణంలో 4జి సేవలను వినియోగదారులకు అందించాలనే లక్ష్యంతో రిలయన్స్ సంస్థ గత మూడు నెలల నుండి పట్టణంలో కేబుల్ వేసేందుకు సిమెంటు రోడ్లను ఇష్టానుసారంగా పగలగొట్టి పట్టణ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అయితే మున్సిపాలిటీ వేసిన సిమెంటురోడ్లకు కేబుల్ తవ్వకాల ద్వారా జరిగే నష్టాన్ని పూడ్చేందుకు మున్సిపాలిటీకి 1.5కోట్ల రూపాయలు చెల్లించేందుకు రిలయన్స్ సంస్థ ముందుకు వచ్చింది. ప్రస్తుతం పగులగొట్టిన సిమెంటురోడ్లను పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేయాలంటే సుమారు 4కోట్ల రూపాయల వరకు ఖర్చు అవుతుందని విశ్లేషకుల అంచనా! ఇంత తంతు జరుగుతున్నా అధికారపార్టీ నాయకులు గానీ, ప్రతిపక్ష పార్టీ నాయకులు గాని మాట్లాడక పోవడం వెనుకగల రహస్యం ఏమిటని పట్టణంలో చర్చ జరుగుతోంది. ప్రజాప్రతినిధులకు, అధికారులకు రిలయన్స్ ప్రతినిధులు మామూళ్ళు అందజేయడంతో పాటు అధికార పార్టీ ఉన్నతశ్రేణి నేతల అండదండలు ఉండటమే కారణమని ప్రజలు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే కావలి మున్సిపాలిటీ ఆధిపత్య పోరుతో అభివృద్ధి ఆగిపోగా ఉన్న రోడ్లను సైతం అడ్డంగా తవ్వితే వాటిని మరలా బాగుచేసుకునేదెప్పుడని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంగళరావునగర్, జనతాపేట, వైకుంఠపురం, పాతవూరు, పుల్లారెడ్డి నగర్, కచ్చేరి మెట్ట, ట్రంకురోడ్డు వంటి ప్రముఖ ప్రదేశాలలో కొన్నిచోట్ల అడ్డంగా రోడ్లను తవ్వి వాటిని పూడ్చకుండా వదిలివేసిన సందర్భాలు అనేకం. తాజాగా పాతవూరు హైమావతమ్మ రైస్‌మిల్లుకు వెళ్లే సిమెంటురోడ్డును పగులగొట్టడంతో సైడుకాలువలోని మురికినీరు బయటకు ప్రవహిస్తుంది. ప్రజలు నడిచేందుకు కూడా దారి లేకుండా పగలగొట్టిన సిమెంటురాళ్లను, మట్టిని రోడ్లపై వేయడంతో ఈ ప్రాంతానికి నిత్యం రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ఇదే విధంగా ఇంకా పలు ప్రాంతాల్లో నెలకొనివుంది. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు, ఈ సమస్యలపై దృష్టి సారించి కేబుల్ తవ్వకాలతో అధ్వాన్నంగా మారిన రోడ్లను త్వరితగతిన బాగుచేసి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూడాలని కోరుతున్నారు.

# ప్రజాఉద్యమాలకు తీరని లోటు

జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు, ప్రముఖ వైద్యులు డా॥ విజయ్‌కుమార్ మృతి చెందడం పట్ల ప్రజా సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసాయి. కావలిలో పలు స్వచ్ఛంధ సంస్థల నాయకులు, ప్రజాసంఘాలు సమావేశమై ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అశ్లీల ప్రతిఘటనా వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సి.శారద మాట్లాడుతూ మరో 20సంవత్సరాల పాటు ప్రజా ఉద్యమాలు కొనసాగించాల్సిన డా॥ విజయ్‌కుమార్ మృతి చెందడం బాధాకరమని, ఆయన మృతికి కారకులైన వారిని చట్టబద్ధంగా శిక్షించాలని అన్నారు. పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ మందుల కన్నా ముందు మనసుకు ఊరటకలిగించే మాటలతో రోగులకు చికిత్స చేసే మానవతావాది అని కొనియాడారు. నెల్లూరుజిల్లా సారా ఉద్యమ నేతగా పేరుగాంచి థర్మల్ విద్యుత్ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న మహోన్నతుడన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు ఎన్.జె.వర్మ, అడ్వకేటు సాయిప్రసాద్, ప్రకాష్‌రావు, సుబ్బయ్య, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే 'బాస'గా నెల్లూరు నెక్ట్స్

(మొదటిపేజీ తరువాయి)

మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు 3గంటల సేపు సుమారు వంద మంది ప్రముఖులు, అధికారులు, రాజ కీయవేత్తలు భవిష్యత్ ప్రణాళికని రూపొందించారు.

కేంద్రమంత్రి వెంకయ్యనాయుడితో పాటు రాష్ట్రమంత్రి నారాయణ, మరో కేంద్రమంత్రి జయంత్ సిన్హా, జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి, మేయర్ అబ్దుల్ అజీజ్ ఈ రెండవ సమావేశానికి అతిథులుగా రాగా శ్రీమతి దీపావెంకట్ అధ్యక్షత వహించారు.

ముందుగా దీపా వెంకట్ మాట్లాడుతూ "నెల్లూరు నెక్ట్స్"కి స్వర్ణభారత్ ట్రస్ట్‌కి ఎలాంటి సంబంధం లేదని, కేవలం కార్యక్రమాన్ని సూచించింది, స్ఫూర్తినిచ్చింది మాత్రమే స్వర్ణభారత్ అని చెప్పారు. కొంతమంది ఈ విషయమై తప్పుగా అనుకుంటున్నారని, దయచేసి అలాంటి అపోహలు తొలగించుకోవాలని చెప్పారు.

తొలివిడత సమావేశంతో చైతన్యవంతులై ఎంతోమంది నెల్లూరీయులు జిల్లా అభివృద్ధి కోసం ముందుకొస్తున్నారని అన్నారు. ముఖ్యంగా అనేకమంది తమ తమ స్వంత గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయడానికి ఆసక్తి కనపరుస్తున్నారని, ఉదాహరణకి తన స్నేహితురాలు శ్రీమతి కవిత, ఆమె భర్త సిద్దారెడ్డి రంగారెడ్డిలు మాదరాజుగూడూరును దత్తత తీసుకుని అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చారని అన్నారు. ఈ సందర్భంగా తొలి సమావేశంలో ఏసిటి ఛైర్మెన్ సుందరరాజ్ ప్రకటించినట్లుగా జిల్లాలో ఇప్పటికే 12గ్రామాలకు ఇంటర్‌నెట్ వసతిని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మరుగుదొడ్ల నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టబోతున్నట్లు ప్రకటించారు.



తొలి సమావేశంలో వివరించినట్లుగానే "నెల్లూరు నెక్ట్స్" చందాలు వసూలు చేయడానికి నిర్దేశించిన కార్యక్రమం కాదని, మన జిల్లాని మన గ్రామాన్ని మన వీధిని మనమే బాగుచేసుకునే క్రమంలో ప్రభుత్వం నుండి తీసుకోవలసిన సహాయం సాధించుకోవలసిన ప్రగతి పథకాలు సంబంధిత విషయాలు చర్చించుకోవడానికి నెల్లూరీయులందరూ ఏకం కావాలని పదేపదే పిలుపునిస్తున్నామని వెంకయ్యనాయుడు అన్నారు.

సిటిజన్ యాక్షన్ గ్రూప్స్ పేరుతో 11గ్రూపులను ఏర్పాటు చేసి వాటికి ముఖ్యసమన్వయకర్తలుగా కొందరిని నియమించడంతో పాటు ఇంకా ఆసక్తి వున్నవారు ఆయా గ్రూపులను వారి మనోవాంఛను బట్టి ఎంపిక చేసుకుని సభ్యుడిగా చేరి నెల్లూరు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

"మౌలిక సదుపాయాలు", "సంస్కృతి/పర్యాటకం", "ఆరోగ్యం", "విద్య/క్రీడలు", "నగరాభివృద్ధి", "మా ఊరు/మా కాలనీ/మా వీధి", "స్వచ్ఛభారత్", "పర్యావరణం/



వేస్ట్‌మేనేజ్‌మెంట్", "భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న నెల్లూరీయుల సమాచార సేకరణ", "విదేశాల్లో వుంటున్న నెల్లూరీయుల సమాచార సేకరణ", "వ్యవసాయ రంగం" వంటి 11విభాగాలను ఏర్పాటుచేసి వాటికి కార్యనిర్వాహక బృందాన్ని నాయుడుగారు సూచించారు.

ఈ సందర్భంగా గ్లోబల్ ఆసుపత్రి ఛైర్మెన్ డా॥ రవీంద్రనాథ్, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కావలి మాజీశాసనసభ్యుడు బీద మస్తాన్‌రావు, ప్రముఖ సైంటిస్ట్ డా॥ జగదీష్‌తో పాటు ఇంకా కార్యక్రమంలో పాల్గొన్న అనేకమంది తమ సలహాలు సూచనలు అందజేశారు.

కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా ఈ కార్యక్రమంలో ఆకస్మిక ప్రత్యేకఅతిథిగా పాల్గొన్నాడు. కృష్ణపట్నం పోర్టు ద్వారా ప్రపంచ పారిశ్రామిక పటంలో అగ్రగామిగా నెల్లూరు చేరబోతోంది. అన్ని విధాలా నెల్లూరుకు అవసరమైన పథకాలను వెంకయ్యనాయుడి ఆధ్వర్యంలో సాధిస్తే అందుకు అవసరమైన అన్ని సహాయసహకారాలను అందించడానికి తమ శాఖ తరపున తానెప్పుడూ సిద్ధంగా ఉంటానని ఆయన చెప్పాడు.

మున్సిపల్ మంత్రి నారాయణ మాట్లాడుతూ ఒక మంచి సంప్రదాయానికి వెంకయ్యనాయుడు శ్రీకారం చుట్టారని, రాష్ట్ర ప్రభుత్వం నుండి అవసరమైన అన్ని పథకాలను నెల్లూరు కోసం తీసుకుని నెల్లూరు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, కలసికట్టుగా అభివృద్ధి చేసుకుని అందరం ఆ విధంగా ముందుకుపోదామని పిలుపునిచ్చాడు.

జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి మాట్లాడుతూ జిల్లాలో వ్యాపార అవకాశాలు పుష్కలంగా వున్నాయని, వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న నెల్లూరు వాసులకు తమ జిల్లాలో సైతం పెట్టుబడులు పెట్టి జిల్లా అభివృద్ధికి దోహదపడాలని, ప్రభుత్వ పరంగా అవసరమైన అన్ని వసతులు, వనరులు అందించడానికి తాను తన యంత్రాంగం సర్వవేళలా సిద్ధంగా ఉంటుందని ప్రకటించారు.

కేంద్ర రక్షణ మంత్రికి సాంకేతిక సలహాదారుడిగా నియమించబడిన డా॥ సతీష్‌రెడ్డిని ఈ సందర్భంగా సభలో అభినందించారు. అనేక మంది నెల్లూరు ప్రముఖులతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో నెల్లూరుజిల్లా అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రెడ్డి గంగాధర్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ సమస్య విపరీతంగా వుందని, మునిసిపాలిటీ మరియు జిల్లా యంత్రాంగం అనుమతిస్తే కొన్ని చోట్ల అవసరానికి మించి నిర్మించిన విగ్రహ ఐల్యాండ్లను తొలగిస్తామని పేర్కొన్నాడు.

మొత్తానికి ఈ రెండవ సమావేశం నెల్లూరుకు ఎక్కడో మేలు జరుగబోతోందన్న సందేశాన్ని పంపించగలిగింది. ఎవరి స్థాయిలో వాళ్ళు తమకు చేతనైన పనికి ముందుకు రావడం నెల్లూరు అభివృద్ధికి మేం కూడా సహకరిస్తాం అని "బాస" చేయడం అభినందనీయం. 2015 ఆగష్టులో 3వ సమావేశం జరగనున్నట్లు చెప్తూ తేదీని తరువాత ప్రకటిస్తామని దీపా వెంకట్ ఈ సమావేశానికి ముగింపు పలికారు.





# వ్యక్తి కాదు... దేశానికి శక్తి

- నెల్లూరు సైంటిస్ట్ సతీష్‌రెడ్డికి అరుదైన గౌరవం
- రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారుగా నియామకం

శాస్త్ర సాంకేతిక రంగాలలో దేశ ప్రతిష్టను ఇనుమడింపచేస్తూ, తాను పుట్టిన నెల్లూరు గడ్డకు కీర్తిప్రతిష్టలు తెస్తున్న డిఆర్‌డిఓ శాస్త్రవేత్త గంద్రా సతీష్‌రెడ్డికి అరుదైన గౌరవం లభించింది. దేశ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఆయనను సాంకేతిక సలహాదారుగా నియమిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. రక్షణ మంత్రికి సాంకేతిక సలహాదారు బాధ్యత ఆషామాషీది కాదు. దేశ భద్రతకు సంబంధించిన అంశం. దేశ రక్షణ, శత్రుదేశాల ముప్పు నుండి తప్పించుకోవడం, ఆయుధాలు సమకూర్చుకోవడం వంటి ఎన్నో కీలకాంశాలపై సతీష్‌రెడ్డి సలహాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఒకరకంగా దేశ రక్షణ మంత్రిని సమర్ధవంతంగా ముందుకు నడిపించేది సాంకేతిక సలహాదారుడే!

దేశ భద్రతకు సంబంధించి ఇంతటి బాధ్యతగల పదవి ఈరోజు నెల్లూరీయుడైన సతీష్‌రెడ్డికి దక్కినందుకు మనమంతా గర్వించాలి. సతీష్‌రెడ్డిది ఆత్మకూరు మండలంలోని మహిమలూరు. సొంతూరిలోనే పదో తరగతి చదివాడు. నెల్లూరు విఆర్‌సిలో ఇంటర్ పూర్తి చేసాడు. అనంతపురం జేఎన్‌టియూలో బీటెక్, హైదరాబాద్ జెఎన్‌టియూలో ఎంఎస్ చేసాడు. డబ్బు మీద వ్యామోహం ఉంటే ఆరోజే ఆయన అమెరికాకో, ఆస్ట్రేలియాకో పోయి ఉండొచ్చు. ఆయన తెలివితేటలకు ఈరోజు ఒబామా కొలువులో పెద్ద పవర్ ఉండేది. ఆ తెలివి అమెరికాకు ఉపయోగపడుతుండేది. కాని సతీష్‌రెడ్డి తన తెలివిని దేశసేవకే అంకితం చేశాడు. 1985లో డిఆర్‌డిఓలో చేరారు. అప్పటికి ఆయన వయసు 21సంవత్సరాలే! అప్పటి నుండి శ్రమించారు. క్షిపణి పరిశోధనలను కొత్త పుంతలు తొక్కించారు. అగ్రదేశాలకు ధీటుగా మెరుగైన నావిగేషన్ వ్యవస్థలను రూపొందించారు. అణుశాస్త్ర పితామహుడు, మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం వద్ద పనిచేశాడు. ఆయన స్ఫూర్తితో మరిన్ని పరిశోధనల వైపు దూసుకెళ్లాడు. డిఆర్‌డిఓ సైంటిస్ట్‌గా, ఆ సంస్థ డైరెక్టర్‌గా, ఇమారత్ డైరెక్టర్‌గా ఎన్నో సేవలందించారు. ఉత్తమ సైంటిస్ట్‌గా గత ప్రధానులచేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

సతీష్‌రెడ్డి... భారత జాతి రత్నం. నెల్లూరు మట్టిలో పుట్టి మెరిసిన ముత్యం. ఆయనలో అసమాన ప్రతిభ వుంది. అంతకుమించి దేశం కోసమే పనిచేయాలన్న కసి వుంది. కాబట్టి ఆయన నెల్లూరుకే కాదు, భారతమాతకే ముద్దుబిడ్డని చెప్పాలి.

# కిలో కందిపప్పు రూ. 50 కే

ప్రభుత్వ ఆదేశాల మేరకు, తెల్ల రేషన్‌కార్డుదారులకు కిలో కందిపప్పును 50 రూపాయలకే పంపిణీ చేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ కొండయ్య తెలిపారు. 391 మెట్రిక్ టన్నుల కందిపప్పును జిల్లాలోని మండల స్టాక్ పాయింట్లకు అందజేశామన్నారు. నెల్లూరు స్టాక్ పాయింట్‌కు 153 మెట్రిక్ టన్నులు, ఆత్మకూరుకు 41, కావలికి 44, గూడూరుకు 51, నాయుడుపేటకు 34, సూళ్ళూరుపేటకు 34, వాకాడుకు 34 మెట్రిక్ టన్నుల వంతున కందిపప్పును పంపామన్నారు.



## "నెల్లూరు నెక్స్ట్"లో

# ప్రత్యేక ఆకర్షణగా బయటవాళ్ళు



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీమతి సిద్దారెడ్డి కవితారెడ్డి, సిద్దారెడ్డి వెంకట్‌రంగారెడ్డి, గ్రీన్‌వ్యాలీ షెల్టర్స్ ప్రై.లి. ఛైర్మెన్ మరియు ఏఏడి ఆర్కిటెక్ట్స్‌కు ప్రిన్సిపల్ ఆర్కిటెక్ట్‌గానే కాక ఛైర్మెన్‌గా కూడా వ్యవహరిస్తున్న టి.యస్.శరవణన్ మరియు గ్రీన్‌వ్యాలీ సంస్థ సలహాదారు ఎస్.శ్రీనివాసన్

ఆదివారం నాడు జరిగిన "నెల్లూరు నెక్స్ట్" సమావేశంలో నెల్లూరీయులు మాత్రమే కాకుండా నెల్లూరులో జరుగుతున్న అభివృద్ధి గురించి విని తామూ భాగస్వామ్యులం కావాలనే లక్ష్యంతో నెల్లూరుకు సంబంధం లేనివారు కూడా పాల్గొనడం విశేషం. కొంతమంది దేశ రాజధాని ఢిల్లీ నుండి ఈ సమావేశానికి వస్తే మరికొంత మంది చెన్నై నుండి కూడా వచ్చారు.

ఆర్కిటెక్చర్ విభాగంగా సంచలనాలు సృష్టిస్తూ నిర్మాణ రంగంలో దూసుకుపోతున్న ప్రఖ్యాత సంస్థ గ్రీన్‌వ్యాలీ షెల్టర్స్(ప్రై) లిమిటెడ్ ఛైర్మెన్ మరియు ఏఏడి ఆర్కిటెక్ట్స్ సంస్థ సారథి టి.ఎన్.శర్వణన్ ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి మద్రాసు నుండి ప్రత్యేకంగా విచ్చేయడం గమనార్హం. నెల్లూరుకు చెందిన సిద్దారెడ్డి వెంకట్‌రంగారెడ్డి, శర్వణన్‌ని వెంకయ్య నాయుడికి పరిచయం చేశారు.

స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రేరణతో నెల్లూరు నెక్స్ట్ కార్యక్రమం ద్వారా నెల్లూరు అభివృద్ధి కోసం జరుగుతున్న సమావేశంలో పాల్గొనడం తన అదృష్టమంటూ తమ సంస్థ ద్వారా గృహ మరియు వ్యాపార సముదాయాలను నిర్మించడమే కాకుండా నెల్లూరును సుందర నగరంగా మార్చడానికి తమ సంస్థ తరపున ఉచితంగా చేయూతనందిస్తానని టి.ఎస్.శర్వణన్ ఈ సందర్భంగా తెలిపాడు.

# నారాయణతో డామేజ్

(మొదటిపేజీ తరువాయి)

లోకేష్‌కు చదువు చెప్పే కోణంలో చంద్రబాబుకు, వారి కుటుంబ సభ్యులకు నారాయణ దగ్గరయ్యాడు. క్రమంగా వారి ఆర్థిక వ్యవహారాల్లోనూ చొరపడ్డాడు. ఆ తర్వాత రాజకీయాల్లోకి ఎంటరయ్యాడు. ఇప్పుడు చంద్రబాబు ఇంట్లోనే కాకుండా తెలుగుదేశంపార్టీలోనూ నెంబర్ టూనంటూ పెత్తనం చేతికి తీసుకున్నాడు. చంద్రబాబు ఆయనకు బాగా అలుసిచ్చాడు. దీంతో నారాయాణ రెచ్చిపోయాడు. పార్టీలో సీనియర్లను సైతం లెక్కచేయకుండా వారి మాటను గౌరవించకుండా చంద్రబాబుకు నేను ఏది చెబితే అది అన్నట్లు వ్యవహరిస్తున్నాడు. దీంతో పార్టీలోని సీనియర్ నాయకులంతా చాలా అసంతృప్తితో రగిలిపోతున్నట్లు తెలుస్తోంది.

2014ఎన్నికల ముందు దాకా కూడా నారాయణకు చంద్రబాబు ఎంత ప్రాధాన్యతనిస్తున్నాడో లోకానికి తెలిసేది కాదు. అది వారింటి వరకే పరిమితమై ఉండేది. కాని ఎన్నికల అనంతరం పార్టీ అధికారంలోకి వచ్చాక నారాయణకు ఉపముఖ్యమంత్రి పదవినివ్వాలనే స్థాయిలో చంద్రబాబు ఆలోచించాడు. కాని చివరి నిముషంలో మనసు మార్చుకుని కె.ఇ.కృష్ణమూర్తితో పాటు కాపుల కోటాలో నిమ్మకాయల చినరాజప్పను కూడా డిప్యూటీ సీఎంను చేసాడు. అయినా నారాయణకు అత్యంత కీలకమైన మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖను కట్టబెట్టడమే కాక నూతన రాజధాని కమిటి ఛైర్మెన్‌గా కూడా ఆయననే నియమించారు. పార్టీలో శివప్రసాద్, కె.ఇ.కృష్ణమూర్తి, యనమల రామకృష్ణుడు వంటి సీనియర్ నాయకుల సలహాలను తీసుకోకుండా రాజధాని కమిటి ఛైర్మెన్‌గా నారాయణను ఎంపిక చేయడం సీనియర్లలో తీవ్ర అసంతృప్తిని రాజేసింది. అయినా చంద్రబాబు మీదున్న గౌరవంతో వీళ్లు తమ బాధను వెళ్లగక్కలేకపోయారు. రాజధాని అధ్యయనం, పెట్టుబడులు రాబట్టడం కోసం చంద్రబాబు బృందం జరిపిన సింగపూర్, జపాన్ పర్యటనలలోనూ నారాయణ ఓవర్‌యాక్షన్ చేయడం ఆ టీంలో వెళ్లిన మిగతా నాయకులకు నచ్చలేదు.

మొత్తంగా పార్టీలో నారాయణ వ్యవహారం పేనుకు పెత్తనమిస్తే నెత్తినంతా కొరికిపెట్టినట్లయ్యింది. ముఖ్యంగా నారాయణ పోకడలు పార్టీని ఏళ్ల తరబడి కనిపెట్టుకున్న వారిని తరిమేసేలా, అవతల పార్టీలలో నుండి వచ్చిన వారికి పదవులిప్పించే స్థాయికి చేరాయి. ముఖ్యంగా నారాయణ సొంత జిల్లా అయిన నెల్లూరుజిల్లాలో మంత్రి చేసిన అపరిపక్వ రాజకీయాల గురించి తెలిసి సీనియర్ నాయకులు అసహ్యించుకున్నారు. నారాయణ వైఖరి మూలంగా చాలామంది మంత్రులు చంద్రబాబుకు దూరమయ్యే పరిస్థితి కూడా వచ్చింది.

పార్టీలో సీనియర్ నాయకుడు కె.ఇ.కృష్ణమూర్తి. పద్ధతిగల మనిషి. కర్నూలుజిల్లాలో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి వంటి రాజకీయ యోధుడినే మోటుకుని నిలబడ్డ నాయకుడు. పార్టీలో చంద్రబాబు తర్వాత గౌరవించదగ్గ మనిషి. అలాంటి కె.ఇ.కృష్ణమూర్తికే నారాయణ వ్యవహారం నచ్చలేదు. నారాయణ పోకడలపై ఆయన నేరుగా చంద్రబాబునే నిలదీసి ఆయనను దారిలో పెట్టమని హెచ్చరించినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. అంతేకాదు, నారాయణ మంత్రిగా వున్నంత కాలం నెల్లూరుజిల్లాలో అడుగుపెట్టనని కూడా కె.ఇ. అన్నట్లు వినికిడి.

పార్టీలో సీనియర్ నాయకుడు, పార్టీ కోసం ఆస్థులమ్ముకుని అప్పులపాలైన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఈ దఫా కూడా ఎమ్మెల్సీ రాకుండా చేయడానికి నారాయణ సర్వశక్తులొడ్డాడు. కాని కె.ఇ.కృష్ణమూర్తి గట్టిగా పట్టుబట్టాడు. సోమిరెడ్డి లాంటి వారికి ఎమ్మెల్సీ ఇవ్వకపోతే పార్టీ కోసం పనిచేసే వాళ్లకు మీపై ఏం నమ్మకముంటుందని చంద్రబాబుతో గట్టిగా వాదించి లైన్ క్లియర్ చేసినట్లు తెలుస్తోంది.

పార్టీలో చంద్రబాబుకు వున్న ఇమేజ్‌కు నారాయణ వల్ల డామేజ్ జరుగుతుంది. చంద్రబాబు గతంలో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునేవాడు. సీనియర్ నాయకులకు ప్రాధాన్యతనిచ్చేవాడు. ఇప్పుడు ప్రతిదానికి నారాయణ మీద ఆధారపడుతున్నాడనే చెడ్డపేరొస్తుంది. నారాయణ కార్పొరేట్ మంత్రి. ఆయన ఆలోచనలు ఆ స్థాయిలో ఉంటాయి. ఆయన ఆలోచనలను బట్టి చంద్రబాబు పరిపాలన సాగిస్తే చీపురుపుల్ల పట్టుకుని గోదారిని ఈదడమే అవుతుంది. దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి సిఎంగా ఉండగా తనకు అత్యంత సన్నిహితుడైన కె.వి.పి.రామచంద్రరావును ప్రభుత్వ సలహాదారుగా నియమించాడు. చంద్రబాబు కూడా నారాయణను అలాగే పెట్టుకుని వుంటే పోయేది. లేదా రాజ్యసభకు పంపించి ఉండొచ్చు. ఇప్పుడు రాజ్యసభలో ఎక్కువ మంది వ్యాపారులే ఉంటున్నారు. అనవసరంగా మంత్రిని చేసి పార్టీలో ఎవరికీ మనశ్శాంతి లేకుండా చేసి తనకు తానే తలనొప్పిని తెచ్చుకుంటున్నాడు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com